

మల్లికార్జున స్వామిని దర్శించుకుని వస్తున్న నారా లోకేశ్ దంపతులు

మల్లన్న సేవలో నారా లోకేశ్ దంపతులు

శ్రీశైలం, ఫిబ్రవరి 1: శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లను గురువారం ఉదయం టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ దంపతులు కుమారుడు దేవాన్ష్‌తో కలిసి దర్శించుకున్నారు. హైదరాబాద్ నుంచి హెలికాప్టర్ ద్వారా సున్నిపెంట హెలిప్యాడ్‌కు చేరున్నారు. అక్కడి నుంచి రోడ్డు మార్గాన ప్రత్యేక కాన్వాయ్‌లో నారా లోకేశ్ దంపతులు సాక్షిగపతి ఆలయం చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీశైలంలోని భ్రమరాంబ అతిథి గృహానికి చేరుకుని అక్కడి నుంచి క్షేత్ర పరిధిలోని బయలు వీరభద్రస్వామి ఆలయాన్ని సందర్శించారు. భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్ల దర్శనార్థం ప్రధానాలయం రాజగోపురం వద్ద నారా లోకేశ్, నారా బ్రాహ్మణిలకు అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం రత్నగర్భ గణపతిని దర్శించుకుని మల్లికార్జున స్వామివారికి అభిషేకం నిర్వహించుకున్నారు. తరువాత భ్రమరాంబికా దేవి అమ్మవారిని దర్శించుకుని కుంకుమార్చన జరిపించారు. ఆలయ అధికారులు నారా లోకేశ్ దంపతులకు స్వామి, అమ్మవార్ల చిత్రపటం, ప్రసాదాలు అందజేసి సత్కరించారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జిలు బుడ్డా రాజశేఖరరెడ్డి, బీసీ జనార్దన్ రెడ్డి, భూమా అఖిలప్రియ, ఎన్ఎండీ ఫరూక్, గౌరు వెంకటరెడ్డి, మాండ్ర శివానందరెడ్డి, టీడీపీ నాయకులు భూమా బ్రహ్మానందరెడ్డి, ఏవీ సుబ్బారెడ్డి, భూమా జగత్ విఖ్యాతరెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, మీడియా కోఆర్డినేటర్ వెంకటరాముడు తదితరులు లోకేశ్‌కు స్వాగతం పలికారు.



శ్రీశైలం ఆలయంలో ధ్వజస్తంభాన్ని మొక్కుతున్న నారా లోకేశ్







నారా లోకేశ్‌కు స్వాగతం పలుకుతున్న గౌరు వెంకటరెడ్డి, మాండ్ర శివానందరెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, భూమా అఖిలప్రియ

నిలిచిపోయిన రిజిస్ట్రేషన్లు

- మొరాయిస్తున్న సర్వర్లు
- అవస్థ పడుతున్న క్రయ, విక్రయదారులు



కల్లూరు, ఫిబ్రవరి 1: కర్నూలు జిల్లాలోని రిజిస్ట్రార్ కార్యాలయాల్లో సాంకేతిక సమస్యలు తలెత్తడంతో రిజిస్ట్రేషన్ సేవలు నిలిచిపోయాయి. మూడు రోజులుగా సర్వర్లు మొరాయిస్తుండటంతో రిజిస్ట్రేషన్లు ఆగిపోయి క్రయ, విక్రయదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. కాసేపు రిజిస్ట్రేషన్లు జరిగి గంటల తరబడి అప్లికేషన్లు ఓపెన్ కాకపోవడంతో ప్రక్రియ ముందుకు సాగడం లేదని అధికారులు అన్నారు. జిల్లా కేంద్రంలోని రిజిస్ట్రేషన్ కార్యాలయంలో సేవలు ఆగిపోవడంతో వినియోగదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సర్వర్లు మొరాయించడంతో కర్నూలు, కల్లూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్లు జరగక క్రయ, విక్రయదారులు వెనుదిరుగుతున్నారు. కర్నూలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ప్రతిరోజూ దాదాపు 60 రిజిస్ట్రేషన్లు జరగాల్సి ఉండగా మూడు రోజులుగా కేవలం 15 రిజిస్ట్రేషన్లు జరిగినట్లు సమాచారం. కల్లూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ప్రతిరోజూ 50-65 రిజిస్ట్రేషన్లు జరగాల్సి ఉండగా గత మూడు రోజుల్లో కేవలం ఒక రిజిస్ట్రేషన్ జరిగినట్లు సమాచారం. రోజుల తరబడి సాంకేతిక సమస్యను పరిష్కరించకపోవడం ఏమిటని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

సచివాలయాల్లో రిజిస్ట్రేషన్లు

రిజిస్ట్రేషన్ ప్రక్రియలో కొత్తగా ఏర్పాటు చేసిన సాఫ్ట్‌వేర్ వల్ల రోజుల తరబడి సర్వర్లు పని చేయడం లేదని తెలుస్తోంది. జగనన్న ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ సచివాలయాల్లోనే జరుగుతాయని ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో ఈ సాంకేతిక సమస్య ఉత్పన్నం కావడం గమనార్హం. ఇంత వరకు రిజిస్ట్రేషన్ నెంబరు సబ్ రిజిస్ట్రార్ కేటాయించేవారని, ఇప్పుడు సాఫ్ట్‌వేరే దస్తావేజు రిజిస్ట్రేషన్‌ను కేటాయిస్తున్నదని అధికారులు తెలిపారు.

సచివాలయాల్లోనూ మొరాయిస్తున్న సర్వర్లు

జగనన్న ఇళ్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియ సచివాలయాల్లో జరగాలని ప్రభుత్వం ఆదేశించింది. పంచాయతీ సెక్రటరీలు సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ చేసేలా వారికి పలు దఫాలుగా శిక్షణ ఇచ్చారు. కల్లూరు మండలంలో 15 సచివాలయాలు ఉండగా కేవలం పెద్దటేకూరు-14, నాయకల్లు(చెట్లమల్లాపురం)-2 సచివాలయాల్లో మాత్రమే రిజిస్ట్రేషన్లు జరిగినట్లు సమాచారం. మిగిలిన సచివాలయాల్లో పంచాయతీ సెక్రటరీలకు అవగాహన లేకపోవటం, సర్వర్లు మొండికేయడంతో గంటల తరబడి రిజిస్ట్రేషన్లు జరగడం లేదని వినియోగదారులు విమర్శిస్తున్నారు.

సార్వత్రిక ఎన్నికలకు సిద్ధం కండి

పోలీసు అధికారులను ఆదేశించిన డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి



డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న పోలీసు అధికారులు


నంద్యాల క్రైం, ఫిబ్రవరి 1 : సార్వత్రిక ఎన్నికలకు సిద్ధం కావాలని రాష్ట్ర డీజీపీ కె.రాజేంద్రనాథ్‌రెడ్డి సిబ్బందిని ఆదేశించారు. గురువారం ఆయన నంద్యాల జిల్లా పోలీసు కార్యాలయంలో డీఐజీలు అమ్మిరెడ్డి, సెంథిల్‌కుమార్‌లతోపాటు కర్నూలు, నంద్యాల, అనంతపురం, సత్యసాయి, కడప జిల్లాల ఎస్పీలతో ఎన్నికల నిర్వహణలో తీసుకోవాల్సిన చర్యలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో పోలీస్ శాఖ నిష్పక్షపాతంగా విధులు నిర్వహించాలన్నారు. సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లపై ప్రత్యేక నిఘా వేసి బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఎన్నికలను శాంతియుతంగా నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. సమస్యాత్మక ప్రాంతాలు, పోలింగ్ స్టేషన్లపై ప్రత్యేక నిఘా ఉంచాలని అన్నారు. అలాగే సమస్యాత్మక గ్రామాల్లో పర్యటించి నిఘా కట్టుదిట్టం చేసుకోవాలని, ఎన్నికల సమయం కంటే ముందే బందోబస్తు ఏర్పాటు చేసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో కర్నూలు ఎస్పీ జి.కృష్ణకాంత్, నంద్యాల ఎస్పీ కె.రఘువీర్‌రెడ్డి, కడప ఎస్పీ సిద్ధార్థకౌశల్, అనంతపురం ఎస్పీ అన్బురాజన్, సత్యసాయి జిల్లా ఎస్పీ ఎస్.వి.మాధవరెడ్డి, నంద్యాల జిల్లాలోని డీఎస్పీలు, సీఐలు పాల్గొన్నారు.

పత్తి క్వింటా రూ. 7010

ఆదోని (అగ్రికల్చర్), ఫిబ్రవరి 1: ఖరీఫ్‌లో సాగు చేసిన పత్తి ధరలు పడిపోవడంతో రైతులు నిరాశ చెందుతున్నారు. సీజన్ ముగిసిపోతున్నా పత్తి ధరలు పెరగకపోవడంతో కుమిలిపోతున్నారు. గురువారం పత్తి ధర క్వింటం గరిష్ఠంగా రూ.7010 పలికింది. గతనెల రోజులుగా పత్తి ధర క్వింటా రూ.7వేలకు మించి పలకడం లేదు. ఈ ధరలు తమకు గిట్టుబాటు కావడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షాభావ పరిస్థితుల వల్ల దిగుబడి గణనీయంగా తగ్గిందని, ధరలు కూడా లేకపోవడంతో అప్పుల పాలవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 1447 క్వింటాళ్ల పత్తి విక్రయానికి రాగా, కనిష్ఠ ధర రూ.4506, గరిష్ఠ ధర రూ.7010, మధ్యస్థ ధర రూ.6759 పలికింది.

ఓటు పద్దు..!

- 300 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇచ్చేలా సోలార్ పాలసీ
- యథావిధిగా ఆదాయ పన్ను శ్లాబులు
- వేతన జీవులకు కాస్త ఊరట
- నానో డీఏపీ ద్వారా పెట్టుబడి తగ్గింపు
- వెనుకబడిన జిల్లాలను విస్మరించిన ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్
- 2024-25 కేంద్ర మధ్యంతర బడ్జెట్



కర్నూలు, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి):

రెండు నెలల్లో లోక్‌సభ సార్వత్రిక ఎన్నికలు రాబోతున్నాయి. ఓటర్లను ఆకట్టుకునే దిశగా కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ 2024-25 కేంద్ర మధ్యంతర బడ్జెట్ గురువారం పార్లమెంట్‌లో ప్రవేశ పెట్టారు. బడ్జెట్‌ను పరిశీలిస్తే వేతన జీవులు, ఆదాయ పన్ను చెల్లించే మధ్యతరగతి ప్రజలకు ఊరట కలిస్తూ యథావిధిగా శ్లాబులు కొనసాగించారు. సబ్సిడీ తగ్గించుకొని కష్టజీవులపై ఎరువుల భారం మోపనుంది. పీఎం కిసాన్ సాయం పెంపు, నానో డీఏపీ తీసుకొచ్చి కష్టజీవుల కన్నీళ్లు తుడిచే ప్రయత్నం చేశారు. ఐఐటీడీఎం కాలేజీ, స్టేట్ క్యాన్సర్ యూనిట్, క్లస్టర్ యూనివర్సిటీలకు బడ్జెట్‌లో ప్రత్యేక స్థానం దక్కలేదు. ఈ ఏడాది ట్రిపుల్ ఐటీడీఎం కళాశాలలో జరిగే పనులకు రూ.60 కోట్లు నిధులు కావాలి. ఎంత ఇస్తారో స్పష్టత లేదు. విభజన హామీ ఊసే లేదు.

మధ్యంతర బడ్జెట్ అంటే..?

సాధారణంగా ప్రతి ఏటా ఫిబ్రవరి ఒకటో తేదీన కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెడతారు. అయితే ఈ ఏడాది ఎన్నికలు జరగనున్నాయి. దీంతో ప్రభుత్వం పూర్తిస్థాయిలో బడ్జెట్ ప్రవేశపెట్టడం కుదరదు. అందుకే కొద్ది కాలానికి మాత్రమే బడ్జెట్‌ను ప్రవేశపెడతారు. దీన్నే మధ్యంతర బడ్జెట్ (ఇంటెరిమ్ బడ్జెట్) అంటారు. ఎన్నికలకు ముందు ప్రవేశపెడుతున్నారు కాబటి 'ఓట్ ఆన్ అకౌంట్' బడ్జెట్ అని పిలుస్తారు. ఎన్నికల తర్వాత ఏ పార్టీ మళ్లీ అధికారంలోకి వస్తుందో తెలియదు. దీంతో పన్నుల ద్వారా వచ్చే ఆదాయం, కొత్త ప్రభుత్వం ఏర్పాటయ్యేంతవరకు వ్యయం అంచనాలకు సంబంధించిన సమాచారాన్ని మధ్యంతర బడ్జెట్‌లో పొందుపరుస్తారు. కొత్త ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత పూర్తిస్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెడతారు.

సీమకు తీరని అన్యాయం



కేంద్ర మధ్యంతర బడ్జెట్‌లో రాష్ట్రానికి, ముఖ్యంగా వెనుకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాలకు ఏ మాత్రం ప్రయోజనం లేని బడ్జెట్ ఇది. ఎన్నికల వేళ విభజన హామీలు అమలుపై బడ్జెట్‌లో ఎన్నో ఆశలు ఉండేవి. ఆశలపై కేంద్ర ఆర్థిక మంత్రి నీళ్లు చల్లారు. పైపై మెరుగులు దిద్ది ఏదో చేస్తున్నామని చెప్పుకోవడానికి అంకెల పద్దులే తప్పా ఏపీకి ఏలాంటి ప్రయోజనం లేదు. ముఖ్యంగా రాయలసీమ జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీ ఊసే లేకపోవడం తీరని అన్యాయం చేసినట్లే.

- గిడ్డయ్య, సీపీఐ జిల్లా కార్యదర్శి

నానో డీఏపీ ద్వారా పెట్టుబడి తగ్గింపు



కేంద్ర ప్రభుత్వం గతేడాది నానో యూరియా తీసుకొచ్చింది. ఇది సక్సెస్ కావడంతో నానో డీఏపీ తీసుకొస్తున్నట్లు బడ్జెట్‌లో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలమ్మ వివరించారు. ప్రస్తుతం డీఏపీ బస్తా (50 కిలోలు) రూ.1,350 ఉంది. ఎకరాకు రెండు బస్తాలు వేస్తే రూ.2,700 అవుతుంది. అదే నానో డీఏపీ (ద్రవ రూపం) ఎకరాకు అర లీటరు చాలని వ్యవసాయ శాస్త్రవేతలు అంటున్నారు. 500 మిల్లీ లీటర్ల (అర లీటరు) నానో డీఏపీ ప్రస్తుతం మార్కెట్‌లో రూ.450 ఉందని ఎరువులు పురుగు మందుల విక్రయ డీలరు ఒకరు పేర్కొన్నారు. అంటే నానో డీఏపీ వల్ల ఎకరాకు రూ.2,250 పెట్టుబడి ఆదా అవుతుందని అంటున్నారు. జిల్లాలో 5 లక్షల మంది రైతు కుటుంబాలు ఉన్నాయి. మిరప, వరి, పత్తి, వేరుశనగ, పప్పు శనగ సహా ఉద్యాన పంటలకు డీఏపీ రసాయ ఎరువులు తప్పక వేస్తున్నారు. వీరందరిని నానో డీఏపీ ద్వారా ప్రయోజనం కలుగుతుందని అంచనా వేస్తున్నారు. పాడి రైతులకు ఊరట కలిగించేలా వివిధ పథకాలు అమలు చేస్తామని మంత్రి ప్రకటించడం రైతులకు కాస్త ఊరట లభిస్తుందనే చెప్పాలి.

పేదలకు సౌర విద్యుత్



ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ వారం పది రోజు ల క్రితం పేదల ఇళ్లలో సౌర వెలుగులు తీసుకొస్తా మని, కోటి ఇళ్లకు రూఫ్ టాప్ సోలార్ పవర్ పథకం తెస్తామని ప్రకటించారు. అందుకు అనుగుణంగానే కేంద్ర ఆర్థిక మంత్రి సోలార్ పాలసీ ప్రకటించారు. కోటి ఇళ్లకు రూఫ్ టాప్ సోలార్ పవ ర్ ఉత్పత్తి యూనిట్లు ఏర్పాటు చేస్తారు. తద్వారా 300 యూనిట్ల వరకు సౌర విద్యుత్ ఉచితంగా అందనుంది. ఈ పథకం ఏమేరకు విజయవంతం అవుతుందో చూడాలి. అలాగే. పేదలకు ఉచిత వైద్యం అందించే 'ఆయుష్మాన్ పథకం' గ్రామీణ, పట్టణ పేదలవాడల్లో పని చేసే ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ వర్కర్లకు వర్తింప చేయనున్నట్లు మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించడం జిల్లాలో పని చేసే వేలాది మంది ఆశాలు, అంగన్‌వాడీల కుటుంబాలకు ఆరోగ్య రక్ష లభించినట్లు అవుతుంది.

వెనుకబడిన జిల్లాలకు మొండిచేయి..

రాయలసీమ వెనుకబడిన జిల్లాల అభివృద్ధికి నిధులు ఇస్తూ వచ్చారు. అయితే ఐదేళ్లుగా ఒక్క పైసా కూడా ఇవ్వడం లేదు. ఎన్నికల వేళ్ల ప్రవేశ పెట్టిన మధ్యంతర బడ్జెట్‌లో ఈ జిల్లాల అభివృద్ధిపై దృష్టి సారిస్తారని ఆశిస్తే నిరాశే మిగిల్చారు. ట్రిపుల్ ఐటీడీఎం కాలేజీకు 2024-25 బడ్జెట్‌లో రూ.34 కోట్లు, వివిధ అభివృద్ధి పనులకు మరో రూ.60 కోట్లు నిధులు కావాలని అడిగారు. బడ్జెట్‌లో ప్రత్యేక కేటాయింపులు లేవు. అలాగే క్లస్టర్ యూనివర్సిటీ, స్టేట్ క్యాన్సర్ యూనిట్‌కు కూడా బడ్జెట్‌లో స్థానం దక్కలేదు. అయితే ఆయా శాఖలకే కేటాయించే బడ్జెట్‌లో మూడు నెలకు అవసరమైన నిధులు వస్తాయని అధికారులు అంటున్నారు. విభజన హామీ ఊసే లేదని ప్రతిపక్ష పార్టీ నాయకులు ఆరోపిస్తున్నారు.

సామాన్యుడి బడ్జెట్ ఇది : కునిగిరి నీలకంఠ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు



సామాన్య ప్రజల ఆర్థిక ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్ రూపొందించారు. పీఎం ఆవాస్ యోజన కింద పేదలకు 2 కోట్లు ఇళ్లు, రూఫ్ టాప్ సోలార్ పవర్ పాలసీ ద్వారా కోటి కుటుంబాలకు 300 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ వంటి పథకాల ద్వారా సామాన్యులకు ఎంతో ప్రయోజనం కలుగుతుంది.

వేరుశనగ ధర పతనం

- మరింత పడిపోయిందని రైతుల ఆవేదన
- గరిష్ఠం రూ.7,199లు, కనిష్ఠం రూ.3,089

కర్నూలు(అగ్రికల్చర్), ఫిబ్రవరి 1: ఉమ్మడి కర్నూలు జిల్లాలో వేరుశనగ రైతుల పరిస్థితి దారుణంగా తయారైంది. అధిక వర్షాలు, వర్షాభావ పరిస్థితుల మధ్య పంట సాగు చేస్తే తీరా మార్కెట్‌లో ధరలు పూర్తిగా పడిపోయాయి. పంట సాగుకు భారీ ఖర్చు చేయాల్సి వచ్చిందని, ఆ మేరకు దిగుబడి రాలేదని, వచ్చిన దిగుబడికి ధరలు లేవని రైతులు ఆవేదన చెందుతున్నారు. మార్కెట్‌లో వ్యాపారుల అక్రమాల కారణంగా దగాపడుతున్నామని అంటున్నారు, వేరుశనగ కాయలు తీసుకొని మార్కెట్‌కు వచ్చిన రైతులు ధర కోసం వ్యాపారుల వంక దీనంగా చూడాల్సిన పరిస్థితి దాపురించింది. గత నెలలో క్వింటం వేరుశనగ కాయలకు రూ.8వేల వరకు రైతులకు లభించింది. వారం రోజులుగా వ్యాపారులు సిండికేట్‌గా మారడంతో క్వింటానికి రూ.700 ధర తగ్గిపోయింది. గురువారం కర్నూలు మార్కెట్ యార్డుకు ఉమ్మడి కర్నూలు జిల్లా నుంచి 815 క్వింటాళ్ల వేరుశనగ కాయలను రైతులు తీసుకువచ్చారు. దీంతో వ్యాపారులు సిండికేటుగా మారి తక్కువ ధరలు కోడ్ చేశారని రైతులు ఆరోపించారు. కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో రైతుల పక్షాన మాట్లాడేవారే కరువయ్యారు. రోజురోజుకు వేరుశనగ కాయల ధర తగ్గుతుండటంతో రైతులు మౌనంగా రోదించడం తప్ప మరేమీ చేయలేకపోయారు. రహస్యంగా టెండర్లు వేస్తున్నామని, ఇందులో సిండికేట్ ఏముందని వ్యాపారులు ఎదురు ప్రశ్నించి రైతుల నోరు మూయిస్తున్నారు. ఎకరా వేరుశనగ పంట సాగుకు రూ.20వేలు పెట్టుబడి అవసరం కాగా, ప్రస్తుతం రూ.30వేల నుంచి రూ.40వేలకు చేరిందని, దిగుబడి కేవలం 2, 3 క్వింటాళ్ల ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. గరిష్ఠంగా రూ.7,020, మధ్యస్థ ధర రూ.6,449, కనిష్ఠ ధర రూ.3,500 మాత్రమే రైతుకు దక్కింది.



కర్నూలు మార్కెట్ యార్డుకు పోటెత్తిన వేరుశనగ కాయలు

శనగ సాగులో నంద్యాల గ్రామ్ -119 విప్లవం



నంద్యాల గ్రామ్ -119 రకం శనగ పంట

నంద్యాల టౌన్, ఫిబ్రవరి 1:

నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఆధ్వర్యంలో ఎనిమిదేళ్ళ క్రితం పప్పు శనగలో కొత్త వంగడం నంద్యాల గ్రామ్ (ఎన్‌బీఈజీ)-119 రకాన్ని తయారు చేశారు. ఇది ప్రస్తుతం శనగ సాగులో విశేష గుర్తింపు పొంది రైతులకు ఆర్థికాభివృద్ధిలో కీలక పాత్ర పోషించే స్థాయికి చేరుకుంది. రాష్ట్రంలో శనగపంటను ఉమ్మడి కర్నూలు, అనంతపురం, కడప జిల్లాలతో పాటు ప్రకాశం, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో ఎక్కువగా సాగు చేస్తారు. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 5 లక్షల హెక్టార్లల్లో శనగ పంట సాగు అయితే ఇందులో 90 శాతం ఈ జిల్లాల నుంచే దిగుబడి వస్తోంది. దేశంలో వందేళ్ళకుపైగా చరిత్ర ఉన్న ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానాల్లో నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఒకటిగా గుర్తింపు పొందింది. ఈ కేంద్రం నుంచి ఎన్నో రకాల పంటల్లో నూతన వంగడాలు, రైతులకు ఉత్తమ యాజమాన్య పద్ధతులు, ఆధునిక సాంకేతికతకు అనుగుణంగా వ్యవసాయ యాంత్రీకరణను ముందుకు తీసుకొచ్చింది.. ఈ కృషిలో ఇక్కడి శాస్త్రవేత్తలు దేశ వ్యాప్త గుర్తింపు పొందారు. ఈ నేపథ్యంలోనే 2015లో నంద్యాల ఆర్‌ఏఆర్‌ఎస్ నుంచి శనగలో విడుదలైన నంద్యాల గ్రామ్ -119 రకం ప్రస్తుతం శనగ సాగు విస్తీర్ణంలో అత్యధిక శాతం సాగవుతోంది. స్వల్పకాలిక రకంగా, అధిక దిగుబడి ఇచ్చే, దక్షిణ భారతదేశంలో ఏపీ, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లో నంద్యాల గ్రామ్ -119 విశేష ప్రాచుర్యం పొందిన నేపథ్యంలో ఇక్కడి శాస్త్రవేత్తల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

రాయలసీమ జిల్లాల్లో విస్తారంగా సాగు


నంద్యాల గ్రామ్ -119 రకం శనగ విత్తనం

నంద్యాల గ్రామ్ -119 రకం రైతు పొలాల్లో ఎకరానికి 10 -12 క్వింటాళ్ళ దిగుబడి, స్వల్పకాలిక రకం కావడంతో రాయలసీమ జిల్లాల్లో సైతం ఈ రకం సాగు విప్లవం దిశగా సాగుతోంది. ప్రకాశం జిల్లాలో సాగు విస్తీర్ణం దాదాపు 40 వేల హెక్టార్లకు చేరిన నేపథ్యంలో ఉమ్మడి కర్నూలు, కడప, అనంతపురం జిల్లాల్లో సైతం ఈ రకాన్ని సాగు చేసేందుకు ప్రకాశం జిల్లా రైతుల నుంచి 119 విత్తనాన్ని కొనుగోలు చేసి సాగుకు ప్రాధాన్యత ఇస్తున్నారు. ఎన్నో ఏళ్ళ నుంచి పలు శనగ రకాలను రైతులు సాగు చేస్తున్నప్పటికీ చీడ, పీడలను తట్టుకునే సామర్థ్యం, తక్కువ కాల వ్యవధితో అనువైన రకంగా నంద్యాల గ్రామ్-119 ప్రాచుర్యం పొందడంతో మున్ముందు మరింత విస్తృత స్థాయిలో ఈ రకం సాగయ్యే అవకాశం ఉన్నట్లు నంద్యాల ఆర్‌ఏఆర్‌ఎస్ శనగ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ వి.జయలక్ష్మి పేర్కొన్నారు.

మూడేళ్లలో 'ప్రకాశం'లో 40 వేల హెక్టార్ల స్థాయికి..



ఎన్‌బీఈజీ -119 రకం మొక్క

నంద్యాల ఆర్‌ఏఆర్‌ఎస్ నుంచి అధికారికంగా నంద్యాల గ్రామ్ -119 విడుదలైన తరువాత ప్రథమ శ్రేణి ప్రదర్శనా క్షేత్రాల్లో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాల్లో ఎంపిక చేసిన రైతులకు ఉచితంగా శనగ విత్తనాన్ని అందజేశారు. ఆ రైతులకు అవగాహన కల్పించి ఉత్తమ యాజమాన్య పద్ధతుల్లో రైతులు సాగు చేసుకోవడానికి వీలుగా వారిని ప్రోత్సహించారు. ఈ నేపథ్యంలోనే ప్రకాశం జిల్లాలో మొత్తం సాగు విస్తీర్ణంలో 40 వేల హెక్టార్లల్లో నంద్యాల గ్రామ్ 119 సాగు స్థాయికి చేరుకోవడం రికార్డుగా చెప్పుకోవచ్చని శాస్త్రవేత్తలు వెల్లడించారు. నంద్యాల గ్రామ్ -119 ముందు ప్రకాశం జిల్లాలో 80 శాతం కాబూలి శనగ రకం కేఏకే-2 అనే 100 గింజలు 35 గ్రాములు బరువు కలిగిన రకాన్ని 20 ఏళ్లుగా సాగు చేస్తూ వచ్చారు. అయితే కేఏకే -2 రకం శనగకు ఎండు తెగులు విపరీతంగా ఆశించి, దిగుబడి రాక రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఈ నేపథ్యంలో 100 గింజలు 38-40 గ్రాముల బరువు కలిగిన స్వల్పకాలిక, అధిక దిగుబడి వచ్చే, ఎండు తెగులును సమర్థవంతంగా ఎదుర్కొనే సామర్థ్యం కలిగిన నంద్యాల గ్రామ్-119పై రైతులు దృష్టి సారించారు. అప్పటికే ఈ రకంపై అవగాహన కలిగి ఉండటంతో ప్రథమ శ్రేణి ప్రదర్శనా క్షేత్రాల ద్వారా వచ్చిన విత్తనాన్ని రైతులు తమ తోటి రైతులకు విత్తనంగా అందజేయడంతో మూడేళ్ల వ్యవధిలోనే ప్రకాశం జిల్లాలో నంద్యాల గ్రామ్ -119 సాగు విస్తీర్ణం 40 వేల హెక్టార్లకు చేరింది.

- స్వల్పకాలిక రకం.. అధిక దిగుబడి
- ప్రకాశం జిల్లాలో శనగ సాగులో 80 శాతం నంద్యాల గ్రామ్ -119
- కర్నూలు, కడప ఉమ్మడి జిల్లాల్లో విశేష గుర్తింపు
- నంద్యాల ఆర్‌ఏఆర్‌ఎస్ వంగడం శనగ -119 సక్సెస్


నంద్యాల గ్రామ్ -119 రకం శనగ పంటను సాగు చేసిన రైతులతో నంద్యాల ఆర్‌ఏఆర్‌ఎస్ శాస్త్రవేత్తలు

నంద్యాల గ్రామ్ -119కు మంచి డిమాండ్



మారుతున్న వాతావరణ పరిస్థితుల్లో కూడా నంద్యాల గ్రామ్-119 రకం సాగు రైతులకు ఆశాజనకంగా ఉంది. మంచి దిగుబడులు ఇచ్చి రైతులకు అండగా నిలవడం జరిగింది. గత ఏడాది క్వింటా ధర రూ.12,000- రూ.14,000 ధర పలికి విత్తనంగా మంచి డిమాండ్‌లో ఉంది. 95 రోజుల స్వల్పకాలిక కాబూలి శనగ రకం, 100 గింజల బరువు 38-40 గ్రాములు, గింజ లావు ఉండి, ఆకర్షణీయంగా ఉంటుంది. హెక్టారుకు వర్షాధారంలో 17.5-20 క్వింటాళ్ళ దిగుబడి, 1 లేదా 2 తడులతో హెక్టారుకు 20-25 క్వింటాళ్ళ దిగుబడి, ఎండు తెగులును తట్టుకునే సామర్థ్యం ఉంది. మున్ముందు రాష్ట్రంలోని అన్ని జిల్లాలతో పాటు ఇతర రాష్ట్రాల్లో కూడా నంద్యాల ఆర్‌ఏఆర్‌ఎస్ నుంచి విడుదలైన నంద్యాల గ్రామ్-119 సాగు విప్లవం రికార్డు దశకు చేరుకుంటుంది.

- డాక్టర్ వి.జయలక్ష్మి, శనగ ప్రధాన శాస్త్రవేత్త, ఆర్‌ఏఆర్‌ఎస్, నంద్యాల

16 మంది సీఐలు బదిలీ

కర్నూలు, ఫిబ్రవరి 1: కర్నూలు రేంజ్ పరిధిలో 16 మంది సీఐలను బదిలీ చేస్తూ డీఐజీ సెంథిల్ కుమార్ ఆదేశాల మేరకు ఎస్పీ జి.కృష్ణకాంత్ ఆదేశాలు జారీ చేశారు.

పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
ఉపేంద్ర బాబు	వీఆర్ కర్నూలు రేంజ్	అనంతపురం రేంజ్
ఆదిలక్ష్మమ్మ	వీఆర్ కర్నూలు రేంజ్	వీఆర్ కర్నూలు
నాగశేఖర్	వీఆర్, కర్నూలు రేంజ్	వీఆర్ అన్నమయ్య
శివాంజనేయులు	వీఆర్, కర్నూలు రేంజ్	అనంతపురం రేంజ్
ఆర్.అర్జున్ నాయక్	వీఆర్ కర్నూలు రేంజ్	అనంతపురం రేంజ్
కంబగిరి రాముడు	వీఆర్ కర్నూలు రేంజ్	ఎస్సీఎస్టీసెల్ నంద్యాల
కళా వెంకట్రమణ	వీఆర్ కర్నూలు రేంజ్	అనంతపురం రేంజ్
శ్రీనివాస నాయక్	కర్నూలు రేంజ్	సీసీఎస్-1 కడప
శ్రీరామ్	కర్నూలు రేంజ్	అనంతపురం రేంజ్
సోనక్క	వీఆర్, కర్నూలు	అనంతపురం రేంజ్
సురేష్ కుమార్	వీఆర్ కర్నూలు	సీసీఎస్ నంద్యాల
ఆర్.రామకృష్ణ	వీఆర్, కర్నూలు	అనంతపురం
లక్ష్మయ్య	వీఆర్ కర్నూలు	అనంతపురం
సుదర్శన ప్రసాద్	వీఆర్, కడప	అనంతపురం రేంజ్
మురళీ కృష్ణ	వీఆర్, అన్నమయ్య	అనంతపురం రేంజ్
మల్లికార్జున గుప్త	పీసీఆర్ నంద్యాల	వీఆర్ అన్నమయ్య

65 మంది ఆర్‌పీఎస్‌ఐలు...

కర్నూలు, ఫిబ్రవరి 1: రాయలసీమ రేంజ్ పరిధిలో ఉన్న 65 మంది ఆర్‌పీఎస్‌ఐలను స్థానాలు మారుస్తూ డీఐజీ సెంథిల్ కుమార్ గురువారం ఆదేశాలు జారీ చేశారు. రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు వీరిని వివిధ జిల్లాలకు కేటాయించారు.

8 మంది డీఎస్పీల బదిలీ

కర్నూలు, ఫిబ్రవరి 1: కర్నూలు జిల్లాలో ఉన్న ఎనిమిది మంది డీఎస్పీలను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

డీఎస్పీ పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
ఐ.సుధాకర్ రెడ్డి	కర్నూలు దిశా పీఎస్	చిత్తూరు దిశా పీఎస్
ఎస్.యుగంధర్‌బాబు	రెండో బెటాలియన్ అసిస్టెంట్	పశ్చిమ గోదావరి సీసీఎస్ కమాండెంట్
ఎం.నాగభూషణం	ట్రాఫిక్, కర్నూలు	14వ బెటాలియన్ డీఎస్పీ
సి.మహేశ్వరరెడ్డి	నంద్యాల ఎస్‌డీపీవో	ఎస్‌డీపీవో పలమనేరు
వి.వెంకట్రామయ్య	ఎస్‌డీపీవో ఆళ్లగడ్డ	ఎస్‌డీపీవో మచిలీపట్నం
ఆర్.రామాంజినాయక్	14వ బెటాలియన్ (అటాచ్డ్)	3వ బెటాలియన్ డీఎస్పీ టు ఎస్సీ, ఎస్టీ సెల్ నంద్యాల
ఎ.శ్రీనివాసరావు	సీసీఎస్, నంద్యాల	ఎస్‌డీపీవో కందుకూరు
ఎస్.సుధాకర్ రెడ్డి	ఎస్‌డీపీవో, పలమనేరు	ఎస్‌డీపీవో ఆళ్లగడ్డ

11 మంది సీఐలకు డీఎస్పీలుగా పదోన్నతి

కర్నూలు, ఫిబ్రవరి 1: కర్నూలు రేంజ్ పరిధిలో ఉన్న 11 మంది సీఐలకు డీఎస్పీలుగా పదోన్నతి కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అలాగే వారికి పదోన్నతి కల్పించి పోస్టింగ్ కూడా ప్రకటించింది. పదోన్నతి పొందిన వారిలో ఉపేంద్రబాబుకు పదోన్నతి కల్పించి అనకాపల్లి దిశా డీఎస్పీగా, నాగరాజును సీఐడీ డీఎస్పీగా, రామకృష్ణుడును ఇంటెలిజెన్స్ డీఎస్పీగా, తేజేశ్వర్‌రావును చిత్తూరు ఎస్‌బీ డీఎస్పీగా, సాయినాథ్‌ను నెల్లూరు దిశా డీఎస్పీగా, రామకృష్ణాచారిని సీఐడీ డీఎస్పీగా, రమణారావును ఇంటెలిజెన్స్ డీఎస్పీగా, నరసింహమూర్తిని నగరి డీఎస్పీగా, వేణుగోపాల్‌ను సీఐడీ డీఎస్పీగా, డేగల ప్రభాకర్‌ను సిట్ డీఎస్పీగా, రవీంద్రనాథ్ రెడ్డిని నంద్యాల డీఎస్పీగా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

పకడ్బందీగా ప్రాక్టికల్స్ నిర్వహించండి: ఆర్‌ఐవో

కర్నూలు(ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 1: ఇంటర్ ప్రాక్టికల్స్ పరీక్షల్లో ఎలాంటి అవకతవకలు జరగకుండా నిర్వహించాలని ఆర్‌ఐవో ఎస్‌వీఎస్ గురువయ్యశెట్టి, డీవీఈవో జమీర్ పాషా అన్నారు. గురువారం స్థానిక ప్రభుత్వ టౌన్ మోడల్ జూనియర్ కళాశాలలో సైన్స్ లెక్చరర్లకు, కంప్యూటర్ ఆపరేటర్లకు పరీక్షలపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 5వ తేదీ నుంచి 20వ తేదీ వరకు ఒకేషనల్ కోర్సు ప్రాక్టికల్స్ పరీక్షలు, 11 నుంచి 20వ తేదీ వరకు జనరల్ కోర్సు ప్రాక్టికల్స్ పరీక్షలు కొనసాగుతాయని అన్నారు. ప్రతి రోజు ప్రాక్టికల్స్ పూర్తయిన వెంటనే మార్కులు అప్‌లోడు చేసి పంపాలన్నారు. ప్రాక్టికల్స్‌లో ఎలాంటి పొరపాట్లు జరగరాదన్నారు. పారదర్శకంగా నిర్వహించాలన్నారు. ఎక్కడైనా తప్పులు జరిగితే అందుకు వారే బాధ్యత వహించాలన్నారు. శుక్రవారం ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు మానవీయ విలువల పరీక్ష, 3న పర్యావరణ విద్యా పరీక్ష జరుగుతుందన్నారు. ఈ పరీక్ష ఉదయం 9 నుంచి 12 గంటల వరకు జరుగుతాయన్నారు. జిల్లాలో 22,239 మంది విద్యార్థులు హాజరవుతున్నారని అన్నారు. విద్యార్థులందరూ పరీక్షకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఉదయం 8 గంటలకు ఓటీపీ వస్తుందని, ఆ తర్వాతనే ప్రశ్నాపత్రం డౌన్‌లోడు చేసుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో ప్రిన్సిపాళ్లు జి.లాలెప్ప, పరమేశ్వరరెడ్డి, సుంకన్న, ప్రభు, సైన్స్ లెక్చరర్లు, కంప్యూటర్ ఆపరేటర్లు పాల్గొన్నారు.

భజన సభ

- ప్రచారం కోసమా అన్నట్లుగా 'ఆసరా' సమావేశం
- జగన్ నామ స్మరణతో విసుగు చెందిన మహిళలు
- కార్యక్రమం ప్రారంభించకుండానే వెళ్లిపోయిన వైనం
- కుర్చీలు ఖాళీ అవుతుండడంతో అడ్డుకున్న మెప్మా సిబ్బంది


ఖాళీ కుర్చీలు

కర్నూలు(న్యూసిటీ), ఫిబ్రవరి 1: వైఎస్ఆర్ ఆసరా చెక్కు పంపిణీ కార్యక్రమం వైసీపీ ప్రచారం కార్యక్రమంలా మారింది. గురువారం నగరంలోని ఎగ్జిబిషన్ మైదానంలో వైఎస్సార్ నాలుగో విడత సంబరాలు అంటూ మెప్మా ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఉదయం 10 గంటలకు ప్రారంభం కావాల్సిన సమావేశం మధ్యాహ్నం 12 గంటలకు ప్రారంభమైంది. అయితే సమావేశానికి హాజరైన వైసీపీ కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు ఆసరా కార్యక్రమాన్ని పక్కనబెట్టి సీఎం జగన్ మోహన్‌రెడ్డి నామస్మరణ చేయడం మొదలుపెట్టారు. దీంతో విసుగు చెందిన మహిళలు.. ఇళ్ల వద్ద పనులు మానుకుని వచ్చామని, ఇక్కడికి వచ్చాక పార్టీ గురించి భజన చేయడం ఏమిటని ప్రశ్నించారు. నాలుగేళ్లుగా మహిళలకు ఆసరా ద్వారా డబ్బులు జమ చేస్తున్నారని.. అయితే ఈ సారి వైసీపీని పొగడటం ఏమిటని మండిపడ్డారు.

బయటకు వెళ్లకుండా అడ్డుకున్న సీఈఓలు

ఉదయం 12 గంటలకు కార్యక్రమం ప్రారంభమైతే నగర మేయర్ బీవై రామయ్య, ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్‌లు 12.30 గంటలకు ఎగ్జిబిషన్ మైదానంలోకి వచ్చారు. అయితే అప్పటికే ఓపిక నశించిన మహిళలు బయటికి వెళ్లిపోవడం మొదలుపెట్టారు. దీంతో అతిథులు వచ్చిన సమయానికే సగం కుర్చీలు ఖాళీలు అయ్యాయి. కార్యక్రమం పూర్తి కాకుండానే మొత్తం వెళ్లిపోయే పరిస్థితి నెలకొనడంతో మెప్మా సీఈఓలు ప్రధాన గేటుకు తాళం వేశారు. అంతేగాకుండా మరోదారి వైపు కుర్చీలు వేసి మహిళలు బయటికి వెళ్లకుండా అడ్డుకున్నారు. చివరకు రూ.20,27,39,575 ఆసరా చెక్కును మేయర్, ఎమ్మెల్యేలు మహిళలకు అందజేశారు.


బయటికి వెళ్లిపోతున్న మహిళలు

కనీస వసతులు కల్పించలేదు..

ఇంటి వద్ద నుంచి ఉదయం 9 గంటలకే బయలుదేరి సమావేశానికి వచ్చిన మహిళలకు కనీస వసతులు కల్పించడంలో అధికారులు ఘోరంగా వైఫల్యం చెందారు. మంచినీరు, బిస్కెట్లు కూడా ఇవ్వకపోవడంతో కొందరు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంత పెద్ద సమావేశం ఏర్పాటు చేసి చివరికి మంచినీరు కూడా ఇవ్వక పోతే సమావేశం ఎందుకు పెట్టారని అక్కసు వెళ్లగక్కారు. కార్యక్ర మంలో అడిషనల్ కమిషనర్ పీవీ రామలింగేశ్వర్, మెప్మా పీడీ నాగ శివలీల, డిప్యూటీ మేయర్లు సిద్దారెడ్డి రేణుక, నాయకల్లు అరుణ, మెప్మా టీపీఆర్‌ఓ వెంకటలక్ష్మి, సీఎంఎం మురళి, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్టు

రెండు వాహనాలు స్వాధీనం


పట్టుబడ్డ అంతర్రాష్ట్ర దొంగల ముఠా సభ్యులు

ఆదోని, ఫిబ్రవరి 1: అంతరాష్ట్ర దొంగల ముఠాను మూడో పట్టణ పోలీసులు అరెస్టు చేశారు. గురువారం నిందితులను విలేకరుల ముందు హాజరుపరిచారు. త్రీటౌన్ సీఐ నరసింహరాజు, టూటౌన్ సీఐ గోపీనాథ్, తాలూకా సీఐ నరసింహా రెడ్డి వివరాలను వెల్లడించారు. హిందూపురానికి చెందిన ఫారుక్, అతని సోదరుడు అక్రమ్, హర్యానా రాష్ట్రం పల్వర్ జిల్లాకు చెందిన కమల్ అలీ, మేవ్ అక్రమ్, ఆసిఫ్ అహ్మద్, అర్షద్, ఇర్షాద్ అనే వ్యక్తులతో పరిచయం ఏర్పరచుకున్నారన్నారు. హిందూపురం పట్టణంలోని ఓ మటన్ షాపు నడుపుతున్నారు. జల్సాలకు అలవాటు పడిన వీరంతా తొందరగా డబ్బులు సంపాదించాలని రోడ్లపై ఉండే పశువులు, పొల్లాల్లో ఉండే దూడలను దొంగతనం చేసి వాహనంలో తరలించేవారు. వాటిని కబేళాలకు తరలించి విక్రయించుకునే వారు. అయితే పశువుల తరలింపునకు అవసరమైన వాహనాన్ని దొంగలించుకునేందుకు పతకం రూపొందించుకున్నారు. జనవరి 21న ఆదోనికి ఒక సఫారీ వాహనంలో వచ్చి నాలుగు చక్రాల వాహనం కోసం వెతుకుతున్నారు. టీడీపీ నేత గుడిసె కృష్ణమ్మ ఇంటి ముందు ఉన్న స్కార్పియో వాహనాన్ని దొంగలించారు. తాము తెచ్చుకున్న సఫారీ వాహనంలోని తాడుతో, ఈ స్కార్పియో వాహనాన్ని కట్టుకొని ఊరు బయటకు తీసుకెళ్లారు. అక్కడి నుంచి వాహనాన్ని హిందూపురానికి నడుపుకుంటూ వెళ్లారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు చేపట్టారు. జనవరి 31న హిందూపురం వద్ద ఆటోనగర్‌లో నలుగురు నిందితులు వసిం అక్రమ్, కమల్ అలీ, మేవ్ అక్రమ్, ఆసిఫ్‌లను అరెస్టు చేశారు. మరో ముగ్గురు నిందితులు ఫరూక్, మహమ్మద్ అరిఫ్, ఇర్షాదులు పరారీలో ఉన్నారు. వారి వద్ద నుంచి టీడీపీ నేత కృష్ణమ్మ స్కార్పియో వాహనంతోపాటు మరో సఫారీ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితులను రిమాండ్‌కు తరలించారు.

ఓటుకు దరఖాస్తు చేసుకోండి

కర్నూలు (కలెక్టర్), ఫిబ్రవరి 1: 18 సంవత్సరాలు నిండిన యువ తీ యువకులు ఓటు నమోదుకు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ జి.సృజన అన్నారు. గురువారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఓటర్ల జాబితా, పోలింగ్ కేంద్రాల మౌలిక సదుపాయాలకు సంబంధించిన అంశాలపై వివిధ రాజకీయ పార్టీ ప్రతినిధులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఓటర్ల తుది జాబితా జనవరి 22 వ తేదిన ప్రచురించామని, జాబితాపై వివిధ దినపత్రికల్లో వస్తున్న వ్యతిరేకవార్తల మీద విచారణ జరిపి తగిన చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ఈవీఎంలు, వివిప్యాట్ల వినియోగం పై అవగాహన కల్పిస్తున్నామని, ఇందులో సెక్టోరల్ ఆఫీసర్స్ , రాజకీయ పార్టీల ప్రతినిధులను కూడా భాగస్వాములను చేస్తామని తెలపారు.

రోడ్డు భద్రతా మాసోత్సవాలు ప్రారంభం

కర్నూలు, ఫిబ్రవరి 1: రోడ్డు భద్రతా మాసోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో అడిషనల్ ఎస్పీ నాగరాజు, డీటీసీ శ్రీధర్ మాసోత్సవాల మోటారు సైకిళ్ల ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ మాట్లాడుతూ వాహనదారులు రోడ్డు భద్రతా నియామాలు పాటించాలన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్లు ధరించాలని సూచించారు. మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని కోరారు. ఆర్టీవో రమేష్, ఎంవీఐ మల్లికార్జున, ట్రాఫిక్ డీఎస్పీ నాగభూషణం, సీఐలు రమణ, గౌతమి, ఆర్ఎస్ఐ హుసేన్ పాల్గొన్నారు.

ఆర్యవైశ్యులు రాజకీయాల్లో రాణించాలి

మాజీ రాజ్యసభ సభ్యుడు టీజీ వెంకటేష్



ప్రమాణస్వీకారం చేస్తున్న జిల్లా ఆర్యవైశ్యసంఘం కమిటీ సభ్యులు

నంద్యాల (కల్చరల్), ఫిబ్రవరి 1: పార్టీలకతీతంగా ఆర్యవైశ్యులు రాజకీయాల్లో రాణించాలని ఆర్యవైశ్య మహాసభ జాతీయ నాయకుడు, మాజీ రాజ్యసభ సభ్యుడు టీజీ వెంకటేష్ పేర్కొన్నారు. నంద్యాల సౌజన్య కన్వెన్షన్‌లో నంద్యాల జిల్లా ఆర్యవైశ్య సంఘం నాయకుల ప్రమాణ స్వీకారానికి విశిష్ఠ అతిథిగా హాజరైన టీజీ వెంకటేష్ మాట్లాడుతూ ఆర్యవైశ్య సంఘాల ద్వారా పేద ఆర్యవైశ్యులను ఆదుకోవాలని అన్నారు. ఆర్యవైశ్యులు అన్ని పార్టీలలో ఉండాల్సిందేనని, వారి స్థాయిని బట్టి వారు రాజకీయంగా ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. ఆర్యవైశ్యులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. నంద్యాల జిల్లా ఆర్యవైశ్య సంఘం జిల్లా ప్రథమ అధ్యక్షుడిగా భవనాశి నాగమహేష్, గౌరవ అధ్యక్షుడిగా ఖండే శ్యామ్‌సుందర్‌లాల్, ప్రధాన కార్యదర్శిగా కాల్వ విజయ శేఖర్ ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ రాష్ట్ర మహాసభ అధ్యక్షుడు చిన్న రామసత్యనారాయణ, గౌరవ అధ్యక్షుడు జయంతి వెంకటేశ్వర్లు, నంద్యాల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు భవనాశి శ్రీనివాస్ పాల్గొన్నారు.

వైసీపీ పాలనను భరించలేకే టీడీపీలోకి..

గౌరు చరిత ఆధ్వర్యంలో 70 కుటుంబాలు చేరిక



గౌరు చరిత సమక్షంలో టీడీపీలో చేరిన బ్రాహ్మణపల్లెకు చెందిన వైసీపీ నాయకులు

కల్లూరు, ఫిబ్రవరి 1: వైసీపీ ప్రభుత్వ అరాచక పాలనను జీర్ణించుకోలేక ఆ పార్టీ నుంచి పెద్దఎత్తున టీడీపీలో చేరుతున్నారని టీడీపీ పాణ్యం ఇన్‌చార్జి గౌరుచరిత స్పష్టం చేశారు. గురువారం ఓర్వకల్లు మండలం బ్రాహ్మణపల్లె గ్రామ వైసీపీ నాయకులు, వార్డు మెంబర్లతో పాటు మొత్తం 70 కుటుంబాలు పాణ్యం వాణిజ్య విభాగం అధ్యక్షుడు బ్రాహ్మణపల్లె నాగిరెడ్డి అధ్యక్షతన గౌరుచరిత సమక్షంలో టీడీపీలో చేరారు. తన స్వగృహంలో మాజీ ఎమ్మెల్యే గౌరుచరిత టీడీపీ కండువాలు వేసి వారిని సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా గౌరుచరిత మాట్లాడుతూ పాణ్యం నియోజకవర్గం వైసీపీలో నాయకులు నిరాశ, నిస్పృహలో ఉన్నారని రానున్న రోజుల్లో 4 మండలాల నుండి అధిక సంఖ్యలో టీడీపీలో చేరడానికి సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. రాష్ట్రాన్ని కాపాడుకోవాలనే సదుద్దేశంతో స్వచ్ఛందంగా ప్రజలు టీడీపీలో చేరుతున్నారని ఆమె అన్నారు. వైసీపీ ప్రజా వ్యతిరేక విధానాల వల్ల విసుగుచెంది తెలుగుదేశం పార్టీలో చేరినట్లు రాజశేఖర్‌చౌదరి, వార్డు మెంబర్లు సుధాకరరెడ్డి, సతీష్ స్పష్టం చేశారు. అనంతరం పార్టీలో చేరిన వారిలో గ్రామ వైసీపీ నాయకులు రామ్మోహన్‌ఆచారి, మహేష్‌రెడ్డి, సుబ్బరాయుడు, బాలుడు, రమణయ్య, గొల్లనాయక్, ఓబులేసు, సామేలు, సంజీవ, నాగరాజు, రాజు, నాగేశ్వరరావు, వెంకటసుబ్బయ్య, నాగేంద్ర, చాంద్‌బాషా, హుసేన్‌బాషా, కరీంబాషా ఉన్నారు.

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి



ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న సురేష్ కుమార్

కర్నూలు(ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 1: ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని యూటీఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షుడు కె.సురేష్ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ధర్నా చౌకు వద్ద రెండో రోజు యూటీఎఫ్ నిరాహారదీక్షలను సురేష్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాత పెన్షన్ విధానానికి మద్దతు ఇవ్వని ప్రతినిధులను ఇంటికి పంపుతామన్నారు. డీఎస్సీ 6వేల పోస్టులను విడుదల చేయడం గొప్పగా చెప్పుకుంటున్నారని, ఇది దగా డీఎస్సీ అన్నారు. 40వేలు ఖాళీలుండగా.. 6వేలు నిరుద్యోగులను దగా చేయడం కాదా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రవికుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి నవీన్ పాటిల్, ఉపాధ్యక్షుడు హేమంత్ కుమార్, రాష్ట్ర కౌన్సిలర్ ఎల్లప్ప పాల్గొన్నారు. దీక్షలకు సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షులు కెంగార మోహన్ సంఘీభావం తెలిపారు.

కేంద్ర బడ్జెట్‌లో జిల్లాకు మోసం

కర్నూలు(న్యూసిటీ), ఫిబ్రవరి 1: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఈసారి కూడా రాష్ట్రానికి, జిల్లాకు మోసం జరిగిందని సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రత్యేక హోదా, విభజన హామీలు, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి, కడప ఉక్కు పరిశ్రమ ఏర్పాటు, విశాఖపట్టణం ఉక్కుపరిశ్రమ ప్రైవేటీకరణ ఆపడం గురించి ఎలాంటి ప్రతిపాదనలు లేకపోవడం శోచనీయమన్నారు. జిల్లా నుంచి వివిధ ప్రాంతా లకు రైళ్లను అనుసంధానం చేయాలని, కొత్త రైళ్లను నడపాలని జిల్లా ప్రజలు కోరుతున్న ఈ బడ్జెట్‌లో నిరాశే మిగిలిందన్నారు.

ధర్నాను జయప్రదం చేయాలి

కర్నూలు(న్యూసిటీ), ఫిబ్రవరి 1: జిల్లాలో కరువు సహాయక చర్యలు చేపట్టాలని కోరుతూ ఈనెల 5న జిల్లా వ్యాప్తంగా అన్ని మండల తహసీల్దారు కార్యాలయాల ఎదుట ధర్నాను జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బి. గిడ్డయ్య పిలుపునిచ్చారు. గురువారం సీపీఐ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ 2023లో వర్షాలు కురవకపోవడంతో ఖరీఫ్, రబీ సీజన్లలో వేసిన పంటలు మొలక దశలోనే ఎండిపోయాయన్నారు. జిల్లాలో 24 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించిన ఇప్పటి వరకు సహాయ చర్యలు చేపట్టక పోవడం దారుణమన్నారు. ఈ సమావేశంలో రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కే.జగన్నాథం, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.మునెప్ప, నగర కార్యదర్శి పి.రామక్రిష్ణారెడ్డి ప్రజా నాట్యమండలి కార్యదర్శి బి.నాగరాజు పాల్గొన్నారు.

● చిరువ్యాపారుల కడుపులు కొట్టవద్దని సీఐటీయూ నగర ప్రధాన కార్యదర్శి సీహెచ్.సాయిబాబా అన్నారు. కృష్ణానగర్ బ్రిడ్జి వేయకముందు 30 సంవత్సరాల నుంచి చిరువ్యాపారాలు చేసుకుంటున్న వారిని తొలగించాలని కమిషనర్ ఆదేశాలు జారీ చేయడం సరికాదన్నారు. కమిషనర్ పునరాలోచించి వ్యాపారులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

నాణ్యతతో పనులు చేపట్టాలి: కమిషనర్



బిర్లా గేట్ జంక్షన్ వద్ద పనులు పరిశీలిస్తున్న కమిషనర్

కర్నూలు(న్యూసిటీ), ఫిబ్రవరి 1: నగరంలోని వివిధ ప్రాంతాలలో జరుగు తున్న అభివృద్ధి పనులను నాణ్యతతో చేపట్టాలని కమిషనర్ ఏ.భార్గవతేజ అధికారులను ఆదేశించారు. గురువారం నగరంలోని బిర్లాగేట్ జంక్షన్, స్మార్ట్ స్ట్రీట్ అభివృద్ధి, బళ్లారి చౌరస్తా వద్ద ఫ్లైఓవర్, మౌర్యఇన్ వద్ద చేస్తున్న స్ట్రీట్ స్కేపింగ్ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఈ నెలాఖరులోగా అన్ని పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. నగరంలో దోమల నివారణకు హంద్రీ నదిలో చేపడుతున్న పను లను ఆయన పరిశీలించారు. ఆయన వెంట ఇన్‌చార్జి ఈఈ షాకీర్, డీఈ నరేష్, ఏఈలు, మెడికల్ హెల్త్ ఆఫీసర్ కే.విశ్వేశ్వరరెడ్డి, ఇంచార్జి సెక్రటరీ నాగ రాజు, ఎంటమాలజిస్టు వెంకటేశ్వర్లు ఉన్నారు.

డ్రాప్ అవుట్ లేకుండా చూడాలి: ఎంఈవో

సి.బెళగల్, ఫిబ్రవరి 1: విద్యార్థులు డ్రాప్ అవుట్ లేకుండా చూడాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదేనని ఎంఈవో ఆదాంబాషా అన్నారు. గురువారం మండల కేంద్రంలోని కొటారుమిట్ట, కోట పాఠశాలలను తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని వంట ఏజెన్సీలకు సూచించారు. అలాగే నాడు- నేడు పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. ఎంఈవో ప్రధానోపాధ్యాయుడు కిశోర్, ఉపాధ్యా యులు ఉన్నారు.

ఎంపీడీవోకు సన్మానం: సి.బెళగల్ ఎంపీడీవోగా ఏసీ రాముడు నాలుగేళ్లు పని చేసి బదిలీపై అనంతపురం జిల్లాకు వెళ్తున్న సందర్భంగా సర్పంచులు, సిబ్బంది ఆయన్ను ఘనంగా సన్మానించారు. ఇన్‌చార్జి ఎంపీడీవో సందీప్, సూపరింటెండెంట్ శ్రీనివాసులు, ఏపీవో లక్ష్మన్న పాల్గొన్నారు.

ముంచిన శనగ

» అనుకూలించని ప్రకృతి
» తగ్గిన శనగ దిగుబడి
» ఆందోళనలో రైతులు

ఓర్వకల్లు, ఫిబ్రవరి 1: శనగ పంట రైతన్నను నట్టేట ముంచింది. ప్రకృతి అనుకూలించకపోవడంతో పంట దిగుబడి గణనీయంగా తగ్గింది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని ఓర్వకల్లు, కన్నమడకల, పూడిచెర్ల, నన్నూరు, లొద్దిపల్లె, ఉయ్యాలవాడ, ఉప్పలపాడు, గుట్టపాడు, హుశేనాపురం తదితర గ్రామాల్లో 9,350 ఎకరాలకు పైగా శనగ పంటను సాగు చేశారు. అయితే గత ఏడాది వర్షాభావ పరిస్థితులు, ప్రకృతి సహకరించడంతో ఎకరాకు 8 నుంచి 9 క్వింటాళ్ల దిగుబడులు వచ్చింది. ఈ ఏడాది ప్రకృతి సహకరించకపోవడంతో ఎకరాకు 3 నుంచి 4 క్వింటాళ్ల దిగుబడి మాత్రమే వచ్చింది. పంట పూత దశలో మంచు అధికం కావడంతో తెగుళ్లు సోకి పంట తీవ్రంగా నష్టపోయింది. దీంతో సాగుకు ఖర్చులు కూడా చేతి కొచ్చేలా లేవని ఆవేదన చెందుతున్నారు. పంటపై శనగ పచ్చ, ఆకు పచ్చ, తెల్లదోమ తెగుళ్లు సోకడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. పంట సాగు కోసం రైతులు ఎకరాకు రూ.20 వేల చొప్పున పెట్టుబడి పెట్టామని, మార్కెట్‌లో గిట్టుబాటు ధర లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. మార్కెట్‌లో క్వింటం రూ.8వేలు గిట్టుబాటు ధర కల్పిస్తే రైతులకు గిట్టుబాటు అవుతుందని అంటున్నారు.



శనగ పంటను నూర్పిడి చేస్తున్న యంత్రం

తీవ్రంగా నష్టపోయాం



నేను 18 ఎకరాల్లో శనగ పంట సాగు చేశా. రూ.2 లక్షలు, 20 వే లు పంటపై పెట్టుబడి పెట్టా. ఎకరాకు 3 నుంచి 4 క్వింటాళ్ల దిగు బడి వచ్చింది. పంట కోత కోయడానికి ఎకరాకు రూ.1,500, నూర్పిడి యంత్రానికి రూ.1000లు చెల్లిస్తున్నాం. పంటపై వచ్చిన దిగుబడి గణనీయంగా తగ్గింది. ఈ దశలో ఎరువులు, పురుగు మందుల ధరలు విపరీతంగా పెరిగాయి. వారికి తగ్గట్టుగా మద్దతు ధర కల్పించి రైతులను ఆదుకోవాలి.

- రోళ్లపాడు మద్దిలేటి, రైతు

రైతులను ఆదుకోవాలి



ఈ ఏడాది వర్షాభావంతోపాటు శనగ పంటకు తెగుళ్లు సోకడంతో పంట దిగుబడి గణనీయంగా తగ్గింది. శనగ రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి. గత ఏడాది ఎకరాకు క్వింటం 7 నుంచి 8 క్వింటాళ్లు దిగుబడి వచ్చింది. అయితే ఈ ఏడాది వర్షాభావంతో పంట దిగుబడి గణనీయంగా తగ్గింది.

- గోప సుబ్బారెడ్డి, రైతు

పదో తరగతి విద్యార్థినికి అరుదైన శస్త్ర చికిత్స

» కోత లేకుండా వీడియో ద్వారా ఆపరేషన్

కర్నూలు(హాస్పిటల్), ఫిబ్రవరి 1: నెలన్నర రోజుల్లో పదో తరగతి పరీక్షలు జరగనున్నాయి. ఈ పరిస్థితుల్లో బాలిక గుండె వెనుక భాగంలో పెద్ద కణితి ఉంది. కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల కార్డియోథొరాసిక్ సర్జన్ డా.సి.ప్రభాకర్ రెడ్డి కోత లేకుండానే త్వరగా కోలుకునే విధంగా ఆపరేషన్ చేశారు. కొత్త పద్ధతిలో వీడియోలో చూస్తూ ఆపరేషన్‌ను విజయవంతంగా బుధవారం నిర్వహిం చారు. బాలిక కోలుకుని నడవసాగింది.

డోన్ మండలం దొరపల్లికి చెందిన పద్మ అనే బాలిక కడుపు నొప్పితో స్థానిక వైద్యులను సంప్రదించింది. అక్కడ ఎక్స్‌రే పరీక్ష తీయగా.. ఛాతిలో కణితి ఉన్నట్లు గుర్తించి కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లాలని సూచించారు. ఈ నెల 18న బాలికను తల్లిదండ్రులు కర్నూలు జీజీహెచ్‌లోని కార్డియోథొరాసిక్ సర్జరీ విభాగానికి తీసుకు వచ్చారు. అక్కడ ఆ విభాగం హెచ్‌వోడీ డా.సి.ప్రభాకర్ రెడ్డి ఎంఆర్‌ఐ, సీటీ స్కాన్ ఇతర పరీక్షలు నిర్వహించగా.. గుండె వెనుక బాగంలో న్యూరో ఫైబ్రోమా అను బడే కణితి ఉన్నట్లు గుర్తించారు. సాధారణంగా బాలికకు ఓపెన్ ఆపరేషన్ చేస్తే ఒకటిన్నర నెలల్లో పరీక్షలు రాయడం కష్టమవుతుందని డా.ప్రభాకర్ రెడ్డి భావించారు. వీఏటీఎస్ వీడియో అసిస్టెంట్ థొరాసిక్ సర్జరీ వంటి అధునాతన పద్ధతిలో ఆపరేషన్ నిర్వహించారు. వీడియో చూస్తూ ఐదు మిల్లీ లీటర్ల 3 చిన్నగాట్లు పెట్టి ఛాతిలోకి టెలిస్కోప్‌ను పంపించారు. వీడియోలో చూస్తూ ఆపరేషన్ చేశారు. దీంతో బాలిక తొందరగా కోలుకుంది.



ఆపరేషన్ అనంతరం కోలుకుంటున్న బాలికతో డాక్టర్ ప్రభాకర్ రెడ్డి

పెద్ద గాయం ఉండదు కాబట్టి రోగికి ఎలాంటి ఇబ్బంది ఉండదని డా.ప్రభాకర్ రెడ్డి తెలిపారు. రోగి త్వరగా రికవరీ అవుతుందని, మార్చిలో జరిగే పరీక్షలకు తొందరగా ప్రిపేర్ కావడానికి వీలు ఉంటుందని తెలిపారు. కార్పొరేట్‌లో రూ.లక్షల్లో ఉండే ఈ సర్జరీని ఆరోగ్యశ్రీ కింద ఉచితంగా చేశామని, యూరాలజీ హెచ్‌వోడీ డా.సీతారామయ్య సహకారం అందించగా.. మత్తు మందును డా.కొండారెడ్డి ఇచ్చారని వెల్లడించారు.

పేదల సొంతింటి కల నెరవేర్చుతా

టీడీపీ కర్నూలు ఇన్‌చార్జి టీజీ భరత్



మాట్లాడుతున్న టీజీ భరత్

కర్నూలు(అర్బన్), ఫిబ్రవరి 1: పేదల ఇళ్ల సొంతింటి కలను నెరవేర్చుతానని టీడీపీ కర్నూలు ఇన్‌చార్జి టీజీ భరత్ అన్నారు. గురువారం నగరంలోని కేసీ కెనాల్ వద్ద ఇందిరమ్మ, టిడ్కో, జగనన్న కాలనీ లబ్ధిదారులు, సొంత ఇంటి స్థలం లేని వారికి స్థలాలు కేటాయించాలని సీపీఐ ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సుకు టీజీ భరత్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో పేదవాడి సొంతింటి కల నెరవేర్చాలన్న ఉద్దేశంతో 19 వేల టిడ్కో ఇల్లు 90 శాతం పూర్తి చేశామని, అయితే వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ గృహాలను పట్టించుకోకుండా వదిలేశారన్నారు. కరోనా సమయలో టిడ్కో ఇల్లు వేలాది మందికి ఉపయోగపడ్డాయన్నారు. వైసీపీ హయాంలో ధరలన్నీ విపరీతంగా పెరిగిపోయాయని, టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ధరలన్నీ నియంత్రణలోకి వస్తాయన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య, టీడీపీ నాయకులు బాబ్జీ, వినోద్ చౌదరి, సీపీఐ నాయకులు జగన్నాథం, పి.రామక్రిష్ణారెడ్డి, ఎస్.మునెప్ప, డి.శ్రీనివాసరావు, నాగరాజు, నల్లన్న పాల్గొన్నారు.

టీడీపీలో చేరిక: బంగారు పేట కాలనీవాసులకు బంగారు భవిష్యత్తు అందించే బాధ్యత తనదని టీడీపీ కర్నూలు ఇన్‌చార్జి టీజీ భరత్ అన్నారు. గురువారం నగరంలోని 13వ వార్డు బంగారుపేటకు చెందిన వైసీపీ నాయకుడు అంజి సమక్షంలో టీడీపీలోకి కార్యకర్తలు, ప్రజలు చేరారు. ఈ సందర్భంగా టీజీ భరత్ మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం వస్తే ప్రజలపై భారం తగ్గుతుందన్నారు. టీడీపీలో చేరిన వారిలో నాగరాజు, జోగి, మేఘ, ప్రసాద్, రవిందర్, రాంబాబు ఉన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సురేష్, శ్రీనివాసరెడ్డి, విఠల్‌రెడ్డి, జేమ్స్, బూత్ ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

యథాస్థానాలకు ఏసీ, డీసీ

కర్నూలు(న్యూసిటీ), ఫిబ్రవరి 1: నగర పాలక సంస్థలో పని చేస్తున్న అడిషనల్ కమిషనర్(ఏసీ) సీవీ రామలింగేశ్వర్, డిప్యూటీ కమిషనర్ (డీసీ) ఎస్వీ శివారెడ్డిలను యథాస్థానాలకు నగర పాలక సంస్థకు బదిలీ చేస్తూ ప్రిన్సిపల్ సెక్రటరీ వైశ్రీలక్ష్మి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల ఏసీ రామలిం గేశ్వర్‌ను గుంటూరు కార్పొరేషన్ అడిషనల్ కమిషనర్‌గా, డిప్యూటీ కమిషనర్ ఎస్వీ శివారెడ్డిని వినుకొండ మున్సిపల్ కమిషనర్‌గా బదిలీ చేశారు. అయితే ఎన్నికల దృష్ట్యా వీరిద్దరిని తిరిగి యథాస్థానానికి బదిలీ చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. దీంతోపాటు గూడూరు కమిషనర్‌గా పని చేస్తున్న ప్రసాద్‌గౌడును నగరపాలక సంస్థ సూపరింటెండెంట్‌గా నియమించినట్లు ఉత్తర్వుల్లో పేర్కొ న్నారు. గత సంవత్సరం నగర పాలక సంస్థల్లో పనిచేస్తున్న సూపరింటెండెంట్ ప్రసాద్‌గౌడును గూడూరు కమిషనర్‌గా నియమించారు.

లోకేశ్‌ను కలిసిన నాయకులు



నారా లోకేశ్‌ను కలిసిన ఎదురూరు విష్ణువర్ధన్‌రెడ్డి, బొగ్గుల దస్తగిరి

కల్లూరు, ఫిబ్రవరి 1: సున్నిపెంట హెలిప్యాడ్ వద్ద టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌ను టీడీపీ నందికొట్కూరు ఇన్ చార్జి గౌరు వెంకటరెడ్డి కలిసి పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. సాధారణ ఎన్నికలు సమీ పిస్తున్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని కార్యకర్తలకు సూచించారు. నందికొట్కూరు, పాణ్యం నియోజకవర్గాల్లో జనసేన, టీడీపీ శ్రేణులతో సమన్వయ పరుచుకొని టీడీపీని గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు.

● **టీడీపీ కార్యకర్తకు గౌరు పరామర్శ:** కల్లూరు మండలం సల్కాపురంలో ప్రమాదవశాత్తు కందుల మిషన్‌లో పడి గాయపడిన టీడీపీ కార్యకర్త శేఖర్‌ను గౌరు వెంకటరెడ్డి పరామర్శించారు. గురువారం నగరంలోని అమిలియో ఆస్పత్రి లో చికిత్స పొందుతున్న శేఖర్ కుటుంబ సభ్యులను గౌరు వెంకటరెడ్డి పరామ ర్శించారు. మెరుగైన వైద్యచికిత్స అందించాలని వైద్యులకు సూచించారు. కోరారు. ఆయన వెంట సల్కాపురం టీడీపీ నాయకులు ఉన్నారు.

కర్నూలు(రూరల్): శ్రీశైలానికి వచ్చిన టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌ను టీడీపీ సీనియర్ నేత ఎదురూరు విష్ణువర్ధన్‌రెడ్డి, కోడుమూరు టీడీపీ యువ నాయకుడు బొగ్గుల దస్తగిరి హెలిప్యాడ్ వద్ద మర్యాదపూర్వకంగా కలిశారు.

ఎక్సైజ్ సూపరింటెండెంట్‌ను కలిసిన నాయకులు

కర్నూలు(అర్బన్), ఫిబ్రవరి 1: ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎం.సుధీర్, సెబ్ ఈఎస్ ఎస్.రవికుమార్‌లను అసోసియేషన్ నాయకులు కలిశారు. గురువారం ఉదయం కానిస్టేబుళ్ల, హెడ్ కానిస్టేబుళ్ల అసోసియేషన్ అధ్యక్షుడు ఓబులేసు ఆధ్వర్యంలో అనంతపురం అధ్యక్షుడు బాలాజీ నాయక్ ఆధ్వర్యంలో వెంకటరాముడు, జగన్నాథం, మధుసూదన్‌రెడ్డి పుష్పగుచ్ఛం ఇచ్చి శాలువతో సన్మానించారు. ఈ సందర్భంగా తమ సమస్యలను వారికి విన్నవించారు. అనంతరం ఏఈఎస్‌లు ఉషశ్రీ, వినోద్ కుమార్‌లను కూడా కలిశారు.

డీఐజీ సెంథిల్ కుమార్‌కు ఆత్మీయ వీడ్కోలు

నంద్యాల క్రైం, ఫిబ్రవరి 1: వచ్చే సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జరుగుతున్న బదిలీల్లో భాగంగా కర్నూలు రేంజ్ డీఐజీ ఎస్.సెంథిల్‌కుమార్ బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా గురువారం నంద్యాల పట్టణంలో ఆయనకు నంద్యాల ఎస్పీ కె.రఘువీర్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీస్ అధికారులు, సిబ్బంది ఆత్మీయ వీడ్కోలు పలికారు. డీఐజీ మాట్లాడుతూ నంద్యాల జిల్లా ఆవిర్భావ సమయం నుంచి వసతుల విషయంలో బలహీనంగా ఉన్నప్పటికీ నెమ్మదిగా అభివృద్ధి చెందుతూ క్రైం రేటు తగ్గించేందుకు పోలీస్ అధికారులు, సిబ్బంది కృషిచేశారన్నారు.



నంద్యాలలో డీఐజీకి వీడ్కోలు పలుకుతున్న పోలీసు అధికారులు

మెగా డీఎస్సీ కాదు.. దగా డీఎస్సీ: పీడీఎస్‌యూ

కర్నూలు(ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 1: రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన మెగా డీఎస్సీ .. దగా డీఎస్సీ అని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.భాస్కర్ ఆవేదన వ్యక్తం చేశారు. నగరంలో స్థానిక గోకారి భవన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల సందర్భంలో నిరుద్యోగులను మోసం చేస్తూ కేవలం 6100 పోస్టులను మాత్రమే భర్తీ చేస్తామని ప్రకటించడం సరికాదన్నారు.

కర్నూలు(న్యూసిటీ): ఎన్నికల ముందు మెగా డీఎస్సీ ఇస్తామని చెప్పి ఐదేళ్లుగా నిరుద్యోగులను ఊరించి మోసం చేశారని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు కే.శ్రీనివాసులు అన్నారు. గురువారం సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అప్రెంటీస్ విధానం తీసుకు వచ్చి జగన్ నిరుద్యోగులను నిలువునా మోసం చేశారని అన్నారు. ఎన్నికల ముందు 25000 పోస్టులు భర్తీ చేస్తామని చెప్పి కేవలం 6100 ఇవ్వటం ఏమిటని ఆయన ప్రశ్నించారు. ఈసమావేశంలో నగర అధ్యక్షకార్యదర్శులు బాబయ్య, బీసన్న, నాయకులు సురేంద్ర, యాదవ్, కాశి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు

● డీఎస్సీ పోస్టుల సంఖ్య పెంచి నోటిఫికేషన్ ఇవ్వాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నగేష్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. డీఎస్సీ పోస్టుల సంఖ్య 25 వేలకు పెంచి నోటిఫికేషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

పెద్దాసుపత్రి కొత్త సార్జెంట్‌గా శ్రీనివాసులు



కొత్త సార్జెంట్‌కు ఉత్తర్వులు అందజేస్తున్న సూపరింటెండెంట్

కర్నూలు (హాస్పిటల్), ఫిబ్రవరి 1: కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో సీనియర్ ఎంఎన్‌వోగా పని చేస్తున్న ఎస్.శ్రీనివాసులును కొత్త సార్జెంట్‌గా నియమిస్తూ ఆసుపత్రి సూపరింటెండెంట్ వెంకటరంగారెడ్డి ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు గురువారం ఉత్తర్వులను సూపరింటెండెంట్ అందజేశారు. ఇన్‌చార్జి సార్జెంట్ బి.వేణుగోపాల్ నుంచి చార్జ్ తీసుకోవాలని పూర్తి స్థాయి బాధ్యతలు తీసుకోవాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. రోగులకు ఇబ్బంది కలగకుండా ఎంఎన్‌వోలతో సక్రమంగా విధులు నిర్వహించేలా చూడాలని, కొత్త సార్జంట్‌ను ఆదేశించారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి డ్యూటీ రోస్టర్ వేసేలా చర్యలు తీసుకోవాలని ఆర్ఎంవో వెంకటరమణను ఆదేశించారు.

సచివాలయ సిబ్బందితో జేసీ సమీక్ష

నంద్యాల రూరల్, ఫిబ్రవరి 1: చాపిరేవుల గ్రామంలో జాయింట్ కలెక్టరు రాహుల్‌కుమార్ రెడ్డి గురువారం సచివాలయ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. నవరత్నాల్లో భాగంగా నిరుపేదలకు మంజూరు చేసిన ఇంటి స్థలాల రిజిస్ట్రేషన్, సంబంధిత అంశాలపై సచివాలయ సిబ్బందితో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 9వ తేదీ లోపు ఇంటి స్థలాల రిజిస్ట్రేషన్‌ను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. కాగా రిజిస్ట్రేషన్ ప్రక్రియ సాఫ్ట్‌వేర్ కొత్తది కావడంతో కొంత జాప్యం ఏర్పడిందని, సమీక్షిస్తు న్నామని చెప్పారు. ఈ రిజిస్ట్రేషన్‌తో పాటు కన్వేయన్స్ డీడ్స్ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు.

చంద్రన్న కార్మిక చైతన్య బస్సు యాత్ర



ఎన్టీఆర్ విగ్రహానికి పూల మాల వేస్తున్న టీఎన్‌టీయూసీ నాయకులు

కర్నూలు(అర్బన్), ఫిబ్రవరి 1: టీఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో చంద్రన్న కార్మిక చైతన్య బస్సు యాత్రను ప్రారంభించారు. గురువారం నగరంలోని మౌర్యఇన్ నుంచి ర్యాలీగా ఆర్ఎస్ రోడ్డు చేరుకుని భవన నిర్మాణ కార్మికులు, ఆటో కార్మికులు, ప్రభుత్వ ఉద్యోగ సంఘాలు, మహిళా సంఘాల కార్యకర్తలతో సభ నిర్వహించారు. అంతక ముందు జిల్లా టీడీపీ కార్యాలయంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈసందర్భంగా టీఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు గోట్టుముక్కల రఘురామరాజు, ప్రధాన కార్యదర్శి ఎం.ఆశోక్ కుమార్‌లు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ నిధులు కూడా దోచుకుని సంక్షేమ ఫలాలు వారికి చేసిన జగన్ ప్రభుత్వాన్ని ఇంటికి పంపాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు పణేశ్వరరావు, గుడిసె నరసింహులు, యూనియన్ నాయకులు మోహన్, రాష్ట్ర , జిల్లా నాయకులు ప్రభాకర్, దశరథ నాయుడు, పాల రాజు, ఆర్టీసీ మోహన్ రాజు, రమణ, ఉమర్ మనీష్ నాయుడు పాల్గొన్నారు.

వెయిట్ లిఫ్టింగ్ క్రీడాకారుడికి అభినందన



క్రీడాకారుడిని అభినందిస్తున్న ఆర్‌యూ ఉప కులపతి

కర్నూలు(స్పోర్ట్స్), ఫిబ్రవరి 1: చండీఘడ్ యూనివర్సిటీలో జనవరి 26వ తేదీ నుంచి 29 వరకు జరిగిన అంతర్ విశ్వవిద్యాలయాల వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో కర్నూలు రాయలసీమ యూనివర్సిటీకి చెందిన అబ్దుల్లా 61 కేజీల విభాగంలో పాల్గొని మూడో స్థానం సాధించారు. గురువారం రాయలసీమ యూనివర్సిటీలో గెలుపొందిన క్రీడాకారుడు అబ్దుల్లాతోపాటు శిక్షకులు యూసుఫ్ బాషాను ఉపకులపతి ప్రొఫెసర్ సుధీర్ ప్రేమ్‌కుమార్ ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా ఉపకులపతి మాట్లాడుతూ త్వరలో జరగబోయే ఖేలో ఇండియా విశ్వవిద్యాలయాల పోటీలకు అబ్దుల్లా పాల్గొని విజేతగా నిలవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య సుందరానంద పుచ్చ, యూనివర్సిటీ స్పోర్ట్స్ కో-ఆర్డినేటర్ డా.శివకిషోర్ పాల్గొన్నారు.

రజిత రథంపై ప్రహ్లాదరాయలు

మంత్రాలయం, ఫిబ్రవరి 1. మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠంలో ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలు రజిత రథంపై భక్తులకు దర్శనం ఇచ్చారు. గురువారం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆశీస్సులతో పండితులు తెల్లవారుజాము నుంచే రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రజిత రథంపై వజ్రాలు పొదిగిన ప్రహ్లాదరాయలను ఊరేగించారు.

పిల్లర్ల దగ్గరే బీసీ భవన్

» టీడీపీ హయాంలో విడుదలైన నిధులు పక్కదారి

కర్నూలు(అగ్రికల్చర్), ఫిబ్రవరి 1: స్థానిక బీ. క్యాంపులోని బీసీ భవన్ నిర్మాణం పిల్లర్ల దగ్గరే ఆగిపోయింది. దీంతో ఆ ప్రదేశం పందుల నివాసంగా మారిపోయింది. ముళ్లకంపలు పెరిగిపోవడంతో పాములు, విషపురుగులు సంచరిస్తున్నాయి. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో బీసీ భవన్ ఏర్పాటు కోసం అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రూ.5 కోట్ల నిధులను మంజూరు చేశారు. ఆనాటి ఉప ముఖ్యమంత్రి కేఈ కృష్ణమూర్తి తదితరులు ఈ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. గత ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే భవన నిర్మాణం నిలిచిపోయింది. ఈ భవన నిర్మాణానికి కేటాయించిన నిధులను కూడా ప్రభుత్వం ఇతర విభాగాలకు దారి మళ్లించారు. దీనిపై బీసీ సంఘాల నేతలు ఆగ్రహంగా ఉన్నారు.

భవన నిర్మాణాన్ని పూర్తి చేయాలి

బీసీల సంక్షేమం కోసం అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు అన్ని జిల్లా కేంద్రాల్లో బీసీ భవనాల నిర్మాణాల కోసం నిధులను కేటాయించారు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం బీసీలను చిన్న చూపు చూ స్తోంది. కర్నూలులో నిర్మిస్తున్న బీసీ భవన్ నిర్మాణం పిల్లర్ల దగ్గరే నిలిచి పోవడానికి ఇదే కారణం. ముఖ్యమంత్రి, మంత్రులను ఎన్నిసార్లు కలిసినా పట్టించుకోవడం లేదు. పైగా నిధులను కూడా ఇతర విభాగాలకు దారి మళ్లించారు.

- వై. నాగేశ్వరరావు యాదవ్, బీసీ సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్



బీ క్యాంపులో పిల్లర్లకే పరిమితమైన బీసీ భవన్

'మంచి అలవాట్లను అలవర్చుకోవాలి'


మాట్లాడుతున్న రెండో అదనపు జిల్లా జడ్జి శ్రీవల్లి

ఆదోని (అగ్రికల్చర్), ఫిబ్రవరి 1: బాల్యం నుంచే మంచి అలవాట్లను అలర్చుకోవాలని ఆదోని రెండో అదనపు జిల్లా జడ్జి ఏవీఎస్ శ్రీవల్లి అన్నారు. రాజరాజేశ్వరి నగర్‌లోని అనంత ఎడ్యుకేషన్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అర్బన్ రెసిడెన్షియల్ వీధి బాలల పాఠశాలను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా వీధి బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని చట్టాలపై అవగాహన కల్పించారు. విద్యార్థి దశ నుంచే లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకొని అందుకు తగ్గ ప్రణాళికతో ముందుకు వెళితే ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని తెలిపారు. హాస్టల్లో ఉన్న విద్యార్థుల పట్ల వారితో నిర్వాహకులు ప్రేమతో ఆదరించి విద్యాబుద్ధులు నేర్పాలని సూచించారు. చట్టాలపై అవగాహన ఉండాలని సూచించారు. ఒకటో పట్టణ పోలీసు స్టేషన్ సీఐ తేజమూర్తి, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ సుందర్, లీగల్ అడ్వైజర్ ఆనంద్, శివ, బాలక్రిష్ణ, కేర్ టేకర్ వరప్రసాద్, గజపతి, జ్యోతి పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన వైసీపీ నాయకుడు

ఆదోని టౌన్, ఫిబ్రవరి 1: స్థానిక ఇందిరా నగర్ ప్రాంతానికి చెందిన వైసీపీ నాయకుడు హనుమంతు గురువారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీ సీనియర్ నాయకులు నీలకంఠప్ప, దేవరాజు ఆయనకు పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. హనుమంతు మాట్లాడుతూ గతంలో కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి ఎనలేని కృషిని చేసిన వైఎస్ రాజశేఖర్ రెడ్డి వారసురాలు వైయస్ షర్మిల రెడ్డి పిలుపుమేరకు తాను కాంగ్రెస్‌పార్టీ సభ్యత్వం తీసుకున్నానని పేర్కొన్నారు. యువజన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుతి రావు, నాయకులు సాయినాథ్, దేవిశెట్టి వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

పరీక్షల భయం వీడాలి : ఎంఈఓ

మద్దికెర, ఫిబ్రవరి 1: విద్యార్థులు పరీక్షలనే భయం వీడితే.. మంచి ఫలితాలు సాధించవచ్చని మండల విద్యాధికారి రంగస్వామి, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు కడవల రవికుమార్, ఆపద్బాంధవ సేవాసమితి అధ్యక్షుడు చౌక్కా సునీల్ కుమార్, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ కరణం సరిత అన్నారు. గురువారం స్థానిక ఆదర్శ పాఠశాలలో పదవ తరగతి చదువుకుంటున్న విద్యార్థులకు ప్రతిభ పరీక్షలను నిర్వహించారు. ఈ పరీక్షల్లో మద్దికెర, ఎం.అగ్రహారం పదవ తరగతి పాఠశాలలో 250 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. హెచ్ఎం దేవేంద్రప్ప, ఫరూక్, ఉపాధ్యాయులు విశ్వనాథ్, ఎస్ఎఫ్ఐ మండల నాయకులు వంశీ, విక్రమ్, తదితరులు పాల్గొన్నారు.

ట్యాంకు నిర్మాణాన్ని అడ్డుకోవడం అన్యాయం

తుగ్గలి, ఫిబ్రవరి 1: గ్రామానికి తాగునీరు అందించడానికి ఏర్పాటు చేసే ట్యాంకు నిర్మాణాన్ని అడ్డుకోవడం అన్యాయమని సర్పంచు పుష్పావతి, ఎంపీటీసీ రామాంజినమ్మ, మాజీ సర్పంచు హనుమంతు అన్నారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ రవిని కలిసి వినతి పత్రం అందించారు. పైచింతలకొండ గ్రామంలో ప్రభుత్వ పాఠశాల వెనుక ఉన్న సర్వేనెంబరు 108/1లో వంక పోరంబోకు స్థలం ఉందని, ఆ స్థలానికి రైతుకు పట్టా ఇచ్చారని పేర్కొన్నారు. ఆ పట్టాను రద్దు చేసి గ్రామ పంచాయతీకి అప్పగిస్తే గ్రామానికి పుష్కలంగా నీరు ఉంటుందని కోరారు.

అభివృద్ధిని అడ్డుకోం : టీడీపీ

టీడీపీ నాయకులు, కార్యకర్తలు అభివృద్ధిని అడుకోరని మండల ఆ పార్టీ నాయకులు మోహన్ అన్నారు. గురువారం మండల పరిధిలోని శభాష్‌పురంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పైచింతలకొండలో టీడీపీ సానుభూతిపరులకు దాదాపు 20 మందికి పైగా కొళాయి కనెక్షన్లు ఇవ్వలేదని, ఏఈ, డీఈలకు పిర్యాదు చేశామన్నారు. తాగునీటి ట్యాంకు నిర్మాణం చేపట్టే పనులను టీడీపీ నాయకులు అడ్డుకున్నారనీ వైసీపీ నాయకులు చెప్పడం అసత్య ఆరోపణలు అని, వైసీపీ కార్యకర్తలే అలాంటి పనులు చేస్తారు గానీ, మేమెప్పుడు అభివృద్ధికి విరుద్ధం కాదని స్పష్టం చేశారు. మా పై చేస్తున్న అసత్యపు ఆరోపణలు మానుకోవాలన్నారు.. మానుకోకపోతే భవిష్యత్తులో ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు.

గిరిజన మహిళకు నష్టపరిహారంగా భూ పంపిణీ

తుగ్గలి, ఫిబ్రవరి 1: కుటుంబ పెద్ద వెంకటేష్ నాయక్ హత్యకు గురికావడంతో కుటుంబ పోషణ కోసం ప్రభుత్వం ఐదెకరాల భూమిని ఇచ్చిందని పత్తికొండ ఆర్డీవో రామలక్ష్మి తెలిపారు. గురువారం మండల కేంద్రం తుగ్గలి తహసీల్దార్ కార్యాలయంలో రోళ్లపాడు తండాకు చెందిన లక్ష్మిబాయికి ఐదెకరాల పట్టాను అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏడాది క్రితం లక్ష్మీబాయి కుమారుడు వెంకటేశ్ నాయక్ హత్యకు గురయ్యాడని తెలిపారు. ఎస్సీ ఎస్టీ యాక్టు కింద వారి కుటుంబ పోషణ కోసం మృతునికి కుమారుడు, కుమార్తెలు మైనర్‌గా ఉండడంతో గార్డెన్‌గా ఆయన తల్లి లక్ష్మిబాయికి డి.పట్టా అందించామని ఆర్డీఓ పేర్కొన్నారు. తహసీల్దార్ రవి, డిప్యూటీ తహసీల్దార్ నిజాముద్దీన్ ఆర్ఐ సుధాకర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

రజిత రథంపై ప్రహ్లాదరాయలు

మంత్రాలయం, ఫిబ్రవరి 1. మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠంలో ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలు రజిత రథంపై భక్తులకు దర్శనం ఇచ్చారు. గురువారం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆశీస్సులతో పండితులు తెల్లవారుజాము నుంచే రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రజిత రథంపై వజ్రాలు పొదిగిన ప్రహ్లాదరాయలను ఊరేగించారు.

డివైడర్‌ను ఢీకొన్న శ్రీకాంత్ రెడ్డి వాహనం

ఆదోని, ఫిబ్రవరి 1: ప్రముఖ పారిశ్రామికవేత్త, టీడీపీ నేత శ్రీకాంత్ రెడ్డి ప్రయాణిస్తున్న వాహనం అదుపుతప్పి డీవైడర్‌కి ఢీకొట్టింది. గురువారం ఉదయం ఆదోని నుంచి హైదరాబాద్‌కు వెళ్తుండగా శంషాబాద్ సమీపంలో కారు అదుపు తప్పింది. కారు ఉన్నపళంగా అదుపుతప్పి డీవైడర్‌ను ఢీకొంది. డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించడంతో శ్రీకాంత్ రెడ్డి ప్రమాదం నుంచి బయటపడ్డారు. ఎలాంటి గాయాలు కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

రెండు బైకులు ఢీ - ఒకరికి తీవ్ర గాయాలు

హొళగుంద, ఫిబ్రవరి 1: మండలంలోని వందవాగిలి గ్రామానికి చెందిన ఉచ్చప్ప, హొళగుందకు చెందిన రహిమాన్‌కు చెందిన బైకులు హొళగుంద గ్రామ శివారులో ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఉచ్చప్పకు తీవ్ర గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. ఉచప్ప తన స్నేహితుడు నూర్ అహమ్మద్‌తో కలిసి హొళగుంద నుంచి వందవాగిలి గ్రామానికి వెళ్తుండగా, రహిమాన్ తన భార్యతో కలిసి ఆదోని నుంచి హొళగుందకు బయలుదేరాడు. హొళగుంద గ్రామ శివారులో రెండు బైక్‌లు ఢీకొన్నాయి. ముగ్గురికి చిన్నపాటి గాయాలు కాగా, ఉచప్పకు తీవ్ర గాయాలు అయినట్లు తెలిపారు. ప్రథమ చికిత్స అనంతరం ఆదోనికి తరలించినట్లు వైద్యులు తెలిపారు.

టీడీపీ పాలనలోనే బీసీలకు పెద్దపీట


సుజాతమ్మను సన్మానిస్తున్న మహిళలు

హాలహర్వి, ఫిబ్రవరి 1: రాజకీయంగా, ఆర్థికంగా వెనుకబడిన కులాలకు అన్ని రంగాల్లో అభివృద్ధి కోసం కృషి చేసిన ఘనత తెలుగుదేశం పార్టీదేనని మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ అన్నారు. గురువారం రాత్రి గూళ్యంలో ఏర్పాటు చేసిన జయహో బీసీ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. బీసీల అభివృద్ధి కోసం ప్రత్యేక చట్టం తెచ్చేందుకు చంద్రబాబు బాధ్యత తీసుకున్నారని అన్నారు. రాష్ట్రంలో త్వరలో టీడీపీకి పట్టం కడుతారని, మరోసారి చంద్రబాబు నాయుడు సీఎం కావడం ఖాయమని స్పష్టం చేశారు. వీరేశప్ప, కుమార్, మల్లన్న, ఎల్లప్ప పాల్గొన్నారు.

నేడు వందవాగిలిలో జయహో బీసీ : వందవాగలి గ్రామంలో శుక్రవారం సాయంత్రం జయహో బీసీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు టీడీపీ మండల కన్వీనర్ తిప్పయ్య గురువారం తెలిపారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత

- అధికార పార్టీ నేతల నిర్మాణాలకు మినహాయింపుపై సర్వత్రా విమర్శలు
- పట్టా చూపాలని కోరినా దాటవేసిన తహసీల్దార్


జగనన్న కాలనీలో అక్రమ కట్టడాలను ఎక్స్‌కవేటర్‌తో కూలుస్తున్న దృశ్యం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

పత్తికొండ టౌన్, ఫిబ్రవరి 1 : పత్తికొండ శివారు ఆదోని రహదారిలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన జగనన్న కాలనీలలో కొందరు అక్రమార్కులు ఇంటి నిర్మాణాలు చేపట్టడంపై ఆంధ్రజ్యోతిలో గురువారం ప్రచురితమయిన "అధికారులు ఈ వంక ను చూడరా" అన్న కథనానికి అధికారులు స్పందించారు. గురువారం ఉదయం ఆర్డీవో రామలక్ష్మి, తహసీల్దార్ విష్ణుప్రసాద్, సీఐ మురళీమోహన్ జగనన్న కాలనీలలో నిర్మిస్తున్న అక్రమకట్టడాలను పరిశీలించారు. కాలనీలో అభివృద్ధి కార్యక్రమాల కోసం కేటాయించిన స్థలంలో కొందరు పట్టాలు లేకపోయినా నిర్మాణాలు అక్రమంగా చేసినట్లు నిర్ధారించి జేసీబీలతో కూల్చివేశారు. ఈ ప్రాంతంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన రెండు జగనన్న కాలనీలకు సంబంధించి చిన్నహుల్తి గ్రామ సర్వేనంబర్ 130/2లో 150 మంది లబ్ధిదారులకు, జూటూర్ రెవెన్యూ పరిధిలోని సర్వేనంబర్ 616లో 232 మంది లబ్ధిదారులకు జగన్న ఇళ్లను మంజూరు చేశారు. దాదాపు లబ్ధిదారులంతా నిర్మాణాలను చేపట్టారని, కొందరు మాత్రం ఎలాంటి పట్టాలు లేకుండా కాలనీలో అక్రమ నిర్మాణాలు చేపట్టారని అధికారులు తెలిపారు. ఈ విషయం మీడియాద్వారా తెలియడంతో పరిశీలించి చర్యలు చేపట్టామని పేర్కొన్నారు. ఎవరైనా ఇలాంటి అక్రమ నిర్మాణాలు చేపడితే భవిష్యత్‌లో కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. 130/2లో ఇద్దరు వ్యక్తులు పట్టాలులేకుండా చేపట్టిన అక్రమ నిర్మాణాలను పూర్తిగా తొలగించిన అధికారులు, 616 సర్వేనంబర్ పరిధిలో వంకసమీపంలో అధికారపార్టీ నాయకుడితోపాటు మరికొందరు నాయకులు నిర్మిస్తున్న ఇళ్లమాత్రం వదిలేయడంపై విమర్శలు వెల్లువెత్తాయి. 'ఆ నాయకుల ఇంటి నిర్మాణాలు కాలనీ పరిధిలోనే ఉన్నాయని, కొద్దిబాగం మాత్రమే ముందుకు వచ్చారని చెబుతూ కొద్దిబాగాన్ని కూల్చి చేతులుదులుపుకున్నారని' స్థానికులు అధికారుల తీరుపై మండిపడ్డారు. అధికార పార్టీ నాయకులకు సంబంధించిన పట్టా నంబర్, పేరు తదితర వివరాలు తెలపాలని తహసీల్దార్‌ను విలేకరులు కోరగా రికార్డుచూడాల్సి ఉందని సమాధానం దాటవేయడం గమనార్హం.

మెగా డీఎస్సీ కాదు.. మెగా మోసం

- జగన్ ప్రభుత్వానికి పతననం తప్పదు
- అప్రెంటిస్‌షిప్ విధానం రద్దు చేసి 25వేల పోస్టులతో మెగా డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వాలి
- విద్యార్థి, యవజన సంఘాల నాయకుల ఆగ్రహం

కోసిగి, ఫిబ్రవరి 1: నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడుతున్న సీఎం జగన్ ప్రభుత్వానికి వచ్చే ఎన్నికల్లో పతనం తప్పదని విద్యార్థి ప్రజాసంఘాలు హెచ్చరించాయి. ఎన్నో రోజులుగా ఎదురు చూస్తున్న డీఎస్సీ నోటిఫికేషన్‌ను 25వలే ఉపాధ్యాయ పోస్టులు ఉండగా కేవలం 6,100 పోస్టులకు మాత్రమే డీఎస్సీ నోటిపికేషన్ ఇవ్వడంతో విద్యార్థి, ప్రజాసంఘాల నాయకులు, డీఎస్సీ అభ్యర్థులు ఆందోళన బాటపట్టారు. ఈ మేరకు గురువారం వివిధ ప్రాంతాల్లో తమ నిరసన తెలిపారు. కోసిగిలో తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి పాలకుర్తి దివాకర్ రెడ్డి , ఏఐవైఎఫ్ తాలుకా కార్యదర్శి ఎం.రాజు వేర్వేరుగా విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వ ప్రకటనను తూర్పారబట్టారు. జగన్ రెడ్డి ప్రభుత్వం ఎన్నికల ముందు మెగా డీఎస్సీ అని చెప్పి.. నిరుద్యోగులను మోసం చేసిందని విమర్శించారు. అప్రంటిస్ విధానం రద్దు చేసి 25వేల పోస్టులతో మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. 2019 ఎన్నికల ముందు రాష్ట్రంలో 25వేల ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయని చెప్పిన జగన్.. అధికారంలోకి వచ్చాక ఐదేళ్లలో ఒక్కసారి కూడా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

నిరుద్యోగులను మోసగించారు..

ఆదోని (అగ్రికల్చర్) : ఐదేళ్లుగా మెగా డీఎస్సీని ప్రకటిస్తామని చెప్పిన వైసీపీ ప్రభుత్వం కేవలం 6100 పోస్టులనే ప్రకటించి నిరుద్యోగులను మోసగించారని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు అన్నారు. కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి పాదయాత్రలో ఏటా డీఎస్సీతో పాటు జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తామని చెప్పారని గుర్తుచేశారు. ఈ ఐదేళ్లుగా ఒక్క టీచర్ పోస్టును కూడా భర్తీ చేయకపోగా.. ఎన్నికలు సమీపిస్తుండటంతో మరోమారు మోసం చేసేందుకు డీఎస్సీని ప్రకటించారని మండిపడ్డారు. ఉద్యోగాలు లేక నిరుద్యోగ యువతీ యువకులు పక్క రాష్ట్రాలకు వెళ్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అప్రెంటిస్ విధానాన్ని కూడా పునరాలోచన చేసి నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని కోరారు. లేనిపక్షంలో వచ్చే ఎన్నికల్లో వైసీపీకి గుణపాఠం చెబుతామని హెచ్చరించారు.

మెగా డీఎస్సీ ఓ నాటకం

ఆస్పరి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి నిరుద్యోగులను మోసగించేందుకు మెగా డీఎస్సీ నోటిఫికేషన్ అంటూ నాటకానికి తెరలేపాడని మెగా డీఎస్సీ ఓ నాటకమని టీడీపీ యువ నాయకుడు సతీష్ కుమార్ అన్నారు. స్థానిక గాంధీ పార్క్ ఆవరణలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో 25 వేల టీచర్ పోస్టులకుగాను కేవలం 6100 పోస్టులను భర్తీ చేస్తానంటూ మెగా డీఎస్సీ అని పేర్కొనడం మోసగించడమేనని విమర్శించారు. నిరుద్యోగ యువత భవిష్యత్తుతో ఆడుకోవడం అన్యామని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశంలో నాయకులు మారేశ్, వీరేశ్ పాల్గొన్నారు.

వేలం రద్దు చేయాలని ఆందోళన

- అధికార పార్టీ నేతలతో మత్స్యశాఖ అధికారులు కుమ్మక్కయ్యారు
- గ్రామస్థులకు తెలియకుండానే వేలం నిర్వహణ
- ఆర్డీవో, తహసీల్దార్ కార్యాలయాల వద్ద పందికోన గ్రామస్థుల నిరసన


ఆర్డీవోకు వినతిపత్రం అందిస్తున్న పందికోన గ్రామస్థులు

పత్తికొండ, ఫిబ్రవరి 1 : పందికోన రిజర్వాయర్‌లో చేపల పెంపకానికి సంబంధించి మత్స్యశాఖ అధికారులు రహస్యంగా నిర్వహించిన వేలాలను రద్దుచేయాలని పందికోన గ్రామస్థులు ఆందోళనకు బాటపట్టారు. గురువారం ఆర్డీవో, తహసీల్దార్ కార్యాలయాలవద్ద బైఠాయించి వేలాలను రద్దు చేయాలని పట్టుబట్టారు. ఈ సందర్భంగా పందికోన గ్రామస్థులు మాట్లాడుతూ పందికోన రిజర్వాయర్‌లో చేపల పెంపకం, విక్రయాలను జనవరి 20వ తేదీ నిర్వహిస్తామని మత్స్యశాఖ అధికారులు గ్రామస్థులకు తెలిపారన్నారు. అయితే, 20వ తేదీ వేలాలు నిర్వహించకుండా రద్దుచేశారని, తిరిగి జనవరి 30న వేలాల నిర్వహణకు తేదీని నిర్వహించినప్పటికీ ఆ విషయాన్ని రహస్యంగా ఉంచారని పేర్కొన్నారు. వేలం విషయం గ్రామస్థులకు తెలపలేదని, కనీసం గ్రామంలో దండోరా కూడా వేయించలేదని, పత్రికల్లో ప్రకటనలు కూడా ఇవ్వలేదని పేర్కొన్నారు. దీంతో 30వతేదీ గ్రామపంచాయతీ కార్యాలయానికి కొందరు అధికారపార్టీ నాయకులను మాత్రమే పిలుచుకుని రహస్యంగా తక్కువ ధరకు వేలాలను నిర్వహించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గడచిన జులై నుంచి ఈ ఏడాది జూన్ వరకు రిజర్వాయర్‌లో చేపలపెంపకం, విక్రయాలకు సంబంధించి అధికారపార్టీ వ్యక్తులతో కుమ్మక్కైన మత్స్యశాఖ అధికారులు ముడుపులు పుచ్చుకుని రహస్య వేలాలను నిర్వహించారని ఆరోపించారు. రహస్యవేలాల వల్ల ప్రభుత్వఆదాయానికి మత్స్యశాఖ అధికారులు గండికొట్టారన్నారు. ఈ వ్యవహారంపై విచారణ జరపాలని రహస్యంగా వేసిన వేలాలను రద్దుచేసి అందరి సమక్షంలో వేలాలను తిరిగి నిర్వహించాలని కోరారు. ఈ మేరకు వినతిపత్రాన్ని ఆర్డీవో రామలక్ష్మికి, తహసీల్దార్ విష్ణుప్రసాద్ అందించారు.

వైసీపీ నాయకుల దౌర్జన్యం

- అక్రమంగా భూమిని కబ్జా చేశారు
- దిబ్బనకల్లు గ్రామవాసి ఆవేదన
- ఒత్తిడి కారణంగానే రిజిస్ట్రేషన్ చేశాం
- పోలీసులకు ఫిర్యాదు చేయండంటూ అధికారి సలహా


రిజిస్ట్రార్‌ను నిలదీస్తున్న బాధితులు

ఆదోని రూరల్, ఫిబ్రవరి 1 : వైసీపీ నాయకుల దౌర్జన్యాలకు సామాన్యులు కంటతడి పెడుతున్నారు. అక్రమంగా రాత్రి వేళలో అధికారులను బెదిరించి రాజకీయ అండదండలతో సామాన్యుల భూములను అప్పనంగా కబ్జా చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే.. ఆదోని మండలం దిబ్బనకల్లు గ్రామానికి చెందిన చిన్న నాగేంద్ర, పెద్ద నాగేంద్ర అన్నదమ్ములు. సర్వే నెం. 84,85లో చిన్న నాగేంద్రకు 2 ఎకరాల 74సెంట్లు, పెద్ద నాగేంద్రకు 10సెంట్ల భూమి ఉంది. చిన్న నాగేంద్ర తన 2 ఎకరాల 74 సెంట్ల భూమిని కొడుకులు వెంకటేష్‌కు 1 ఎకరా 37సెంట్లు, శ్రీనివాసుల పేరిట 1 ఎకరా 37సెంట్ల భూమిని రిజిస్ట్రేషన్ చేయించారు. పెద్ద నాగేంద్రకు ఉన్న 10సెంట్ల స్థలం వెంకటేశుల పొలానికి దక్షిణ భాగం ఉంది. కానీ పెద్ద నాగేంద్ర వైసీపీ నాయకుడు కావడంతో తన రాజకీయ పలుకుబడిని ఉపయోగించి వెంకటేష్ స్థలంలోని ఉత్తర భాగంలో 10 సెంట్ల స్థలాన్ని బుధవారం రాత్రి తన ముగ్గురు కొడుకుల పేరిట పెద్ద నాగేంద్ర రిజిస్ట్రేషన్ చేయించాడు. ఈ విషయాన్ని ముందే గమనించిన చిన్న నాగేంద్ర తన ఇద్దరు కొడుకులతో కలిసి సబ్ రిజిస్ట్రార్ రాజశేఖర్, డాక్యుమెంట్ రైటర్ వెంకోబరావు దృష్టికి తీసుకెళ్లారు. అయినా వారు పట్టించుకోకుండా అధికార పార్టీ అండదండలతో 10సెంట్ల స్థలాన్ని డబల్ రిజిస్ట్రేషన్ చేశారు. విషయం తెలుసుకొన్న బాధితులు గురువారం సబ్ రిజిష్టర్ కార్యాలయానికి చేరుకొని సబ్ రిజిస్ట్రార్, డాక్యుమెంట్ రైటర్‌ను నిలదీశారు. ఫిర్యాదు చేసిన ఎలా రిజిస్టర్ చేస్తారని బాధితులు రిజిస్ట్రార్ ఎదుట కన్నీరు పెట్టారు. పత్రాలను రద్దు చేయకపోతే ఇక్కడే ఆత్మహత్య చేసుకుంటామన్నారు. సబ్ రిజిస్ట్రార్ ఆంధ్రజ్యోతి వివరణ కోరగా.. దౌర్జన్యం.. ఒత్తిడి కారణంగానే వారు రిజిస్టర్ చేయించుకున్నారని, బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేస్తే వారు చేసుకున్న రిజిష్టర్ పత్రాలను రద్దు చేసి బాధితులకు న్యాయం చేస్తామని సబ్ రిజిష్టర్ రాజశేఖర్ తెలిపారు.

విద్యుత్ మీటర్ల ధ్వంసం

- ఉచిత విద్యుత్ పథకానికి తూట్లు పొడిచిన సీఎం జగన్ : సీపీఐ, రైతుసంఘం ఆగ్రహం


వ్యవసాయ బోర్లకు అమర్చిన మీటర్లను ధ్వంసం చేస్తున్న నాయకులు

ఎమ్మిగనూరు, ఫిబ్రవరి 1: రైతులకు ప్రయోజనం చేకూర్చే ఉచిత విద్యుత్ పథకానికి తూట్లు పొడుస్తూ వ్యవసాయ బోరు మోటార్లకు ఏర్పాటు చేసిన విద్యుత్ మీటర్లను సీపీఐ, రైతుసంఘం నాయకులు ధ్వంసం చేశారు. గురువారం ఎమ్మిగనూరు శివారులోని కలుగొట్ల గ్రామ పరిధి పొలాల్లో రైతుల బోరు మోటార్లకు ఏర్పాటు చేసిన ఐదు విద్యుత్ మీటర్లను నాయకులు, కార్యకర్తలు పంపన్న గౌడ్, రంగన్న, భాస్కర్ యాదవ్,సమీవుల్లా, చిన్నన్న, జబ్బార్ ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా వారు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. నాయకులు మాట్లడుతూ నాడు రైతుల మేలుకోరి ఉచిత విద్యుత్‌ను రాజశేఖర్ రెడ్డి ప్రవేశపెడితే నేడు ఆయన తనయుడు సీఎం జగన్ ఉచిన విద్యుత్‌కు తూట్లు పొడుస్తూ రైతుల మోటార్లకు విద్యుత్ మీటర్లు అమర్చి సంక్షోభంలోకి నెట్టారని విమర్శించారు. సీఎం జగన్ పాలనలో రైతులు భూములు అమ్ముకొని ఇతర ప్రాంతాలకు వలస వెళ్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రైతులు వినియోగిస్తున్న బోర్లకు అధిక విద్యుత్ చార్జీలు వచ్చే మీటర్ల కాంట్రాక్టును ఆదానికి కట్టబెట్టి ఒక్కో మీటరు రూ. 13,650ల చొప్పున రాష్ట్ర ప్రభుత్వం రూ. 20 వేల కోట్లను దోచిపెడుతోందని మండిపడ్డారు. ప్రభుత్వం ఇప్పటికైనా విద్యుత్ మీటర్లను అమర్చే విధానాన్ని ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో రైతులతో కలిసి ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. నాయకులు ఆంజనేయులు, రంజాన్, ఖాసీం, రసూల్, షరీఫ్ మాలిక్ పాల్గొన్నారు.

రామలింగేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవం


స్వామిని దర్శించుకుంటున్న మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జి తిక్కారెడ్డి

కోసిగి, ఫిబ్రవరి 1: కోసిగి మండల పరిధిలోని దుద్ధి, కోల్‌మాన్‌పేట గ్రామ పొలాల్లోని రామలింగేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవ వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త గుడిసె రామలింగప్ప ఆధ్వర్యంలో ఉదయం నుంచే ఆలయంలో వివిధ రకాల పూజలు నిర్వహించారు. ఈ వేడుకలకు మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జి పాలకుర్తి తిక్కారెడ్డి, ఆదోని మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు, మాజీ ఫుడ్ కమిషన్ మెంబరు గుడిసె కృష్ణమ్మ, ఆలయ ధర్మకర్తలు గుడిసె రామలింగప్ప వీరికి శాలువ పూలమాలతో సన్మానించారు. అనంతరం రామలింగేశ్వరస్వామి సన్నిధిలో స్వామి, అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. 2024 ఎన్నికల్లో టీడీపీ ఇటు మంత్రాలయంలోనూ, రాష్ట్రంలోనూ అధికారంలోకి రావాలని నియోజకవర్గ ప్రజలు, రైతులు సుఖసంతోషాలతో ఉండాలని కోరుకున్నట్లు తిక్కారెడ్డి తెలిపారు. టీడీపీ మండల కన్వీనర్ జ్ఞానేష్, నాయకులు, కార్యకర్తలు భక్తులు ఉన్నారు.

ఘనంగా మాచిదేవ జయంతి

మంత్రాలయం, ఫిబ్రవరి 1: రజకుల ఆరాధ్య దైవం మడిమాల మాచిదేవ జయంతిని స్థానికంగా ఘనంగా నిర్వహించారు. గురువారం రజక సంఘం ఆధ్వర్యంలో మడిమాల మాచిదేవ చిత్రపటానికి పూలమాలలతో అలంకరించి డీజేలు, డప్పులు మంగళవాయిద్యాలతో పెద్ద ఎత్తున బాణాసంచా పేలుస్తూ ఊరేగించారు. టీటీడీ బోర్డు సభ్యులు సీతారామిరెడ్డి, గురెడ్డి భీమిరెడ్డి, సర్పంచు తెల్లబండ్ల భీమయ్య, గోరుకల్లు కృష్ణ, జనార్ధన్ రెడ్డి, బసిరెడ్డి, ఎంఈవో రాగన్న, ఎస్ఐవేణుగోపాల్‌రాజు పాల్గొన్నారు.

ఈ సర్పంచు పదవే వద్దు

- రూ.20 లక్షల అప్పుకు భూమి అమ్ముకున్నా
- పైసా బిల్లు రాలేదు.. గ్రామంలో మర్యాద లేదు
- అధికార పార్టీ సర్పంచు తనయుడి ఆవేదన

మంత్రాలయం, ఫిబ్రవరి 1: ఈ సర్పంచు పదవే వద్దు.. ఎన్ని పనులు చేసినా పైసా బిల్లులు రాలేదు. ఊళ్లో ప్రజల ముందు మర్యాదే లేదని మంత్రాలయం మండలం పరమాన్‌దొడ్డి తండా వైసీపీ సర్పంచు ఎస్ఎం విజయభారతి కుమారుడు సత్యనారాయణ రెడ్డి వాపోయారు. గురువారం తహసీల్దార్ కార్యాలయం వద్ద పనుల కోసం వచ్చాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్పంచు ఎన్నికల సమయంలో రూ.20 లక్షలు అప్పులు చేశామని, ఆ అప్పులు తీర్చేందుకు మా గ్రామ పరిధిలోని సర్వేనెంబరు 102/ఏ భూమిని రూ.20లక్షలకు అమ్మేశామని తెలిపారు. తాగునీటి కోసం పైపులైన్ ఏర్పాటు చేసి ఇంటింటికి కొళాయిలు అందించినా ఒక్క రూపాయి బిల్లు కూడా రాలేదన్నారు. ఈ సర్పంచు పదవే వద్దు బాబోయ్.. ఇంకా రెండేళ్లు ఉంది.. ఏమి చేయాలో అర్థం కావడం లేదంటూ వాపోయాడు. ప్రజల మధ్య తిరగలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.

ఓటరు జాబితాను పూర్తి స్థాయిలో పరిశీలించాలి


సెల్‌ఫోన్‌లో ఎలా అప్‌లోడ్ చేయాలో చూపుతున్న నాయకులు

ఎమ్మిగనూరు, ఫిబ్రవరి 1: ఓటరు జాబితాను క్షేత్రస్థాయిలో పరిశీలించి టీడీపీ అధికారంలోకి వస్తే ప్రజలకు లబ్ధి చేకూరే సూపర్ సిక్స్ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఐటీడీపీ సభ్యులు రామాంజనేయులు, సాల్మన్ రాజు, నరేంద్ర, నీలకంఠ, హనుమంతు, చిదానంద సూచించారు. గురువారం పట్టణంలోని మెడికల్ భవన్‌లో మాజీ ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో టీడీపీ క్లస్టర్, యునిట్, బూత్, కేఎస్ఎస్ ఇంచార్జీలకు శిక్షణాకార్యక్రమాన్ని నిర్వహించారు.

ఫుట్‌బాల్ పోటీల్లో హుబ్లీ జట్టు విజయం

ఎమ్మిగనూరు టౌన్, ఫిబ్రవరి 1: నీలకంఠేశ్వర స్వామి జాతర సందర్భంగా ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్ రాష్ట్ర ఫుట్‌బాల్ పోటీల్లో కర్ణాటక రాష్ట్రంలోని హుబ్లీ జట్టు విజేతగా నిలిచింది. పోటీల్లో చివరి రోజు గురువారం ఎమ్మిగనూరు, హుబ్లీ జట్టు హోరా హోరిగా పోటీపడ్డాయి. ఎమ్మిగనూరు జట్టుపై హుబ్లీ జట్టు నిర్ధీత సమయంలో 0-1తేడాతో విజయం సాధించింది. దీంతో ప్రథమస్థానంలో నిలిచిన హుబ్లీ జట్టుకు ట్రోఫీ, రు. 1,00,116లు నగదు బహుమతి, ద్వితీయ స్థానంలో నిలిచిన ఎమ్మిగనూరు జట్టుకు రూ. 50,116లు, తృతీయ స్థానంలో నిలిచిన గద్వాల జట్టుకు రూ. 20,116ల నగదు బహుమతిని అందజేశారు.

ఒకేషనల్ కోర్సుల ద్వారా ఉన్నత స్థాయి ఉద్యోగాలు

గోనెగండ్ల, ఫిబ్రవరి 1: విద్యార్థులు ఒకేషనల్ కోర్సులను చేయడం ద్వారా ఉన్నత స్థాయిలో ఉద్యోగాలు పొందవచ్చని ఉన్నత పాఠశాల హెచ్ఎం నాగభూషణం అన్నారు. గురువారం ఉన్నతపాఠశాలలో 9,10 వతరగతుల విద్యార్థులకు ఒకేషనల్ కోర్సులను గురించి వివరించారు. ఇందులో బాగంగా స్థానిక బ్లూమినరల్ వాటర్ ప్లాంట్‌ను విద్యార్థులకు చూపించారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

మంత్రాలయం, ఫిబ్రవరి 1: మండలంలోని మాధవరం గ్రామంలో బుధవారం అర్ధరాత్రి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఈడిగ రాజు ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకున్నారు. మంత్రాలయం, మాధవరంలో తుంగభద్ర నది నుంచి అక్రమంగా ఇసుకను యథేచ్ఛగా రవాణ చేస్తున్న విషయం తెలిసిందే. బుధవారం అర్ధరాత్రి పోలీస్‌స్టేషన్ ముందే ఇసుక ట్రాక్టర్ వెళ్తుండగా.. ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకుని పోలీసులు సీజ్ చేశారు.

చికిత్స పొందుతూ ఎంపీటీసీ మృతి

కోసిగి, ఫిబ్రవరి 1: వందగల్లు గ్రామానికి చెందిన వందగల్లు వైసీపీ ఎంపీటీసీ మాలదాసరి మల్లికార్జున (32) రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున మృతి చెందాడు. గురువారం సాయంత్రం మల్లికార్జున భౌతికకాయం గ్రామానికి రావడంతో వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు మురళీరెడ్డి, ఎంపీపీ ఈరన్నలు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. మట్టి ఖర్చులకు రూ.10 వేలు కుటుంబ సభ్యులకు అందజేశారు.

క్రీడా పోటీల్లో రాణించాలి : టీడీపీ

కోసిగి, ఫిబ్రవరి 1: రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో రాణించాలని టీడీపీ నాయకులు చూడి ఉలిగయ్య, మాధవరం రామకృష్ణారెడ్డి అన్నారు. గురువారం చిర్తనకల్ మారెమ్మ దేవర ఉత్సవాల సందర్భంగా నిర్వహించిన డివిజన్‌స్థాయి కబడ్డీ పోటీల్లో మొదటి బహుమతి రూ.15వేల నగదును రామకృష్ణారెడ్డి అందజేశారు. రెండో బహుమతి రూ.10వేల నగదు బహుమతిని కర్నూలు పార్లమెంటు టీడీపీ ఉపాధ్యక్షుడు ముత్తురెడ్డి అందించారు.

ఇద్దరు చిన్నారుల అదృశ్యం


ఉజ్వల


అపూర్వ

మద్దికెర, ఫిబ్రవరి 1: మండలంలోని ఎం.అగ్రహారం గ్రామానికి చెందిన సురేంద్ర, లత దంపతులకు చెందిన కవల పిల్లలు ఆదూరి ఉజ్వల, ఆదూరి అపూర్వ (7) అదృశ్యమయ్యారు. గురువారం రాత్రి 8 గంటల ప్రాంతంలో విద్యుత్ లేని సమయంలో చిన్నారులు ఈ సంఘటన చోటు చేసుకుంది. గ్రామం మొత్తం చుట్టుపక్కల వెతికినా ఆచూకి లభ్యం కాలేదు. గ్రామంలో సాయంత్రం 6 గంటల నుంచి ఇద్దరు గుర్తు తెలీని వ్యక్తులు టెంకాయ చెట్లకు ఇంజక్షన్లు వేస్తామంటూ గ్రామంలో తిరుగుతున్నట్లు గ్రామస్థులు తెలిపారు. వీరి నివాసం పక్కీరప్ప స్వామి దేవాలయంలో గ్రామం చివరిలో ఉండడం వల్ల విద్యుత్ లేని సమయంలో కిడ్నాప్ చేసి ఉంటారని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కుటుంబ సభ్యులు ఎస్ఐ మహ్మద్ రిజ్వాన్‌కు ఫిర్యాదు చేయడంతో గ్రామంలో విచారణ చేపట్టారు.